ఆదివారం

ప్రజాశక్తి

ఆగస్టు 22, 2004

కథా నిలయం
శ్రీకాకుళం



www.britishcouncil.in/on

www.studyincanada.com

www.corporate@mafoa.com

www.mancamp@satyam.net.in

www.visugobleedu.com

naukri.com

www.abs.india.org

www.mapquest.com

Rai University

STUDENT ADVANTAGE

REIMS

STUDY IN AUSTRALIA

BRITISH COUNCIL

విదేశీ ఉపాధి కేంద్రాలు

హ్యాపీ బర్త్‌డే

(22-8-2004 నుంచి 28-8-2004 వరకు)

తాటికొండ మేఘన
6సం॥, 22.8.1998
రజని-రంగారావు
కోటపహాడ్-నల్లగొండ

జి.అలేఖ్య
1సం॥, 23.8.2003
దేవమ్మ-వెంకటస్వామి
అత్తాపూర్-హైదరాబాద్

భాను కిరణ్
ఆగస్టు-23
మీరాబాయి-స్వామిరాజు
కిడ్స్ ప్రైడ్ స్కూల్-కాకినాడ

వెంకట శివ కుమార్
ఆగస్టు-23
శ్రీదేవి-శ్రీనివాసుడు
భీమవరం-ప॥గో॥

మోహన్ శ్రీరామ తులసి-ఠాగూర్ లక్ష్మీ ప్రసన్న
6సం॥, 23.8.1998
హిమవతి-రమణ
తోటపేట-తూ॥గో॥

జె. ఉదయ్‌కుమార్
1సం॥, 24.8.2003
మాధవి-లచ్చయ్య
అబ్బాయిపాలెం-మ॥నగర్

డి. నవ్యశ్రీ
1సం॥, 24.8.2003
నాగమణి-వెంకటేశ్వర్లు
రాయగూడెం-ఖమ్మం

భాగ్యచంద్ర
ఆగస్టు-24
రూత్‌కుమారి-జాన్‌రాజు
తణుకు-ప॥గో॥

కె.శశికళ
10సం॥, 25.8.1994
నిర్మలారాణి-బుజ్జిబాబు
జగ్గయ్యపేట-కృష్ణా

సాయి యశస్విని
2సం॥, 27.8.2002
జ్యోతి-మారుతి
ఒంగోలు-ప్రకాశం

కె. శ్రావ్య
7సం॥, 27.8.1997
రజని-అప్పారావు
నెలకొండపల్లి-ఖమ్మం

ఎం.విశ్వతేజ
1సం॥, 28.8.2003
సుమత-మహేందర్
పోలేపల్లి-మ॥నగర్

రియా
ఆగస్టు-28
రీనా-కిరణ్
ప్రభాదేవి-ముంబాయి

దీప్తి
2సం॥, ఆగస్టు-2002
శోభ- ఆనంద్‌గౌడ్
చెలిమిలా-మ॥నగర్

సుప్రియ
1సం॥, ఆగస్టు-2003
ధనలక్ష్మి-సీతారాములు
జఫర్‌ఘడ్-వరంగల్

టి.తేజస్వి
4సం॥,ఆగస్టు-2000
రజని-శ్రీనివాస్
బోనకల్లు-ఖమ్మం

యార్కల వింధ్యశ్రీ
1సం॥, ఆగస్టు-2003
అంజిత-శాంతికుమార్
నోముల-నల్లగొండ

ప్రశాంత్ కుమార్
శ్రీదేవి-శ్రీనివాసుడు
భీమవరం-ప॥గో॥

శిష్టా అంజలీ హంస వార్గేవి
4సం॥, ఆగస్టు-2000
శివపార్వతి-సీతారామ్
న్యూఅజిత్‌సింగ్‌నగర్-విజయవాడ

కార్తీక్
2సం॥, ఆగస్టు-2002
చంద్రకళ-శోభన్‌బాబు
వెంకటాపురం-సికింద్రాబాద్

లోకేష్ నాయక్
లక్ష్మీబాయి-లక్ష్మానాయక్
రామస్వామితండ-అనంతపురం

అమృత వాసవి మణికంఠ
1సం॥, ఆగస్టు-2003
సత్యవేణి-రామకృష్ణ
పోలవరం-ప॥గో॥

గౌతమ్
9సం॥, 23.8.1995
రాధ-చంద్రయ్య
బుద్దారం-మ॥నగర్

ఆదిత్య
5సం॥, ఆగస్టు-1999
రాధ-చంద్రయ్య
బుద్దారం-మ॥నగర్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం





ఆకట్టుకున్న కవర్‌స్టోరీ

1 ఆగష్టు 2004 ఆదివారం కవర్‌స్టోరీ 'కాలంతో పోటీ బుల్లెట్ ట్రైన్స్' చదివిన తరువాత రైళ్ళ గురించి తెలుసుకోగలిగాము. వివిధ దేశాలలో హైస్పీడ్ రైళ్ళు వాని వేగం, భారత రైళ్ళ పరుగులు మొదలగు విషయాలు తెలుసుకున్నాము. ఆరోగ్యం పేజీలో 'కంటివ్యాధుల నిర్లక్ష్యం అంధత్వానికి మార్గం' ద్వారా కంటివ్యాధుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందో తెలిసింది. టూరిస్టుగైడ్‌లో ఈ వారం 'అద్భుత తీరప్రాంతం పాండిచ్చేరి' గురించి చదివి అనేక విషయాలు తెలుసుకున్నాము. ఈ వారం అన్ని శీర్షికలూ హైలెట్‌గా ఉన్నాయి.

– కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా

అద్భుతం-ఆకర్షణీయం

'ఆడపిల్ల' కథ నేటి వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతుంది. అక్రమ సంపాదనే ప్రధానధ్యేయంగా భావిస్తున్న డాక్టర్లకు, ఆడపిల్ల

పుడితే అధోగతే అనుకుంటున్న తండ్రులకు, ఆడపిల్లలను చులకన భావంతో చూసే నేటి సమాజంలోని అందరికీ కనువిప్పు కలిగిస్తుంది. ఆదివారం అనుబంధం నూతనంగా ముస్తాబై చిన్నారులతో పాటు అందరి పాఠకులను అలరిస్తోంది. చిన్నారుల పుట్టినరోజు చిరుకానుకగా చిన్నారుల కలర్ ఫొటోలను ప్రచురించి వారితో కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేయడం బాగుంది. కలంస్నేహం పెంపొందించుటకు ప్రవేశపెట్టిన శీర్షిక కూడా బాగుంది. ఈ శీర్షిక అందరికీ ప్రవేశపెడితే బాగుండును.

-శివాల శ్రీనివాసరావు,
ఆముదాలవలస.

మా ప్రాణం

ఆదివారం అనుబంధం అంటేనే ప్రాణం. హ్యాపీ బర్త్‌డే, కలం స్నేహం శీర్షికన చిన్నారుల ఫొటోలు కడు రమణీయం. న్యాయపరమైన సలహాలు శీర్షిక ఓ ఆణిముత్యం. కంటివ్యాధుల నిర్లక్ష్యం-అంధత్వానికి మార్గం అన్న ఆరోగ్య శీర్షిక, కాలంతో పోటీ బుల్లెట్ రైళ్ళు కవర్‌స్టోరీ విజ్ఞానదాయకం.

- డి వి రెడ్డి, అనకాపల్లి.

మంచివ్యాసం

అద్భుత తీర ప్రాంతం పాండిచ్చేరి గురించి శేషు చాలా చక్కగా తెలియజేసినందుకు మా అభినందనలు.

- పుట్టా శ్రీనివాసరావు,
లక్కవరపుకోట.

స్ఫూర్తిదాయకం

మానవసమాజంలో అలజడి అశాంతి రేగినపుడు, ఆయా సమస్యల పరిష్కారం కోసం, ప్రజలలో మంచి ఆలోచనాశక్తిని పెంపుచేయడంకోసం నిజమైన ప్రజాకళాకారులు రంగస్థల, దృశ్యరూపకాలలో పాల్గొంటారు. కళాసాహిత్యాలపేజీలో గుజరాత్‌లో జరిగిన గోద్రానంతర మతోన్మాద హింసాకాండకు కల్పన గావించిన నాటకం 'సాటిరో జులై' విశేషాలు మమ్మల్నెంతో ఆకట్టుకున్నాయి. ప్రజాసమస్యలు పాత్రోచితంగా యదార్ధంగా చూపిన బెంగాలీ దర్శకుడి గురించిన వ్యాసం బాగుంది.

– జె సుధాకరరావు, కాకినాడ.

ఎక్సలెంట్‌గా ఉంది

శీర్షికలన్నీ ఆసక్తికరంగా చదివాం. రియల్‌స్టోరీ 'వెలుగుప్రదాత' చదివిన తరువాత మానవత్వం ఇంకా సత్యవతిలాంటి వారివల్ల బతికేఉందనిపించింది. కవర్‌స్టోరీ వెరైటీగా, హైలెట్‌గా, ఎక్సలెంట్‌గా ఉంది. బుల్లెట్‌ట్రైన్‌లు పరుగెత్తేవేగం గురించి చదివి విస్తుబోయాం. ఇలాంటి రైళ్ళ రూపకల్పనలో జపాన్ మొదటిస్థానంలో ఉందని తెలుసుకున్నాం. ఆ ట్రైన్‌ల విశేషాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. ఆరోగ్యం శీర్షికలో కంటికి(అంధత్వానికి) సంబంధించి ఏ నిర్లక్ష్యం చేయకూడదని హితబోధ చేశారు.

- ఎం డి ముస్తఖీమ్,
కొల్లాపూర్, మహబూబ్‌నగర్‌జిల్లా

రియల్‌స్టోరీ

చూపుకోల్పోయినవానికి చూపును ప్రసాదించి కొత్తజీవితాన్ని ఇచ్చిన వెలుగుప్రదాత సత్యవతిలాంటి మహాసాధ్వీమణులు నిజంగా అరుదుగా కనిపిస్తారు.

- మేడూరి సత్యనారాయణ,
తిరుపూరు.

మనలో మాట

ఎక్కడ పోగొట్టుకున్నామో...!

"కందిచేల్లో కర్రు పోగొట్టుకుని పప్పుదాకలో వెతుకుతున్నాడంట ఒకడు." ఆ సామెత ఆ పసివాడికి అర్థంకాదుగానీ వాణ్ణడ్డం పెట్టుకుని ఇంట్లోవాళ్ళందరూ వినాలనే బిగ్గరగా చెప్పాను. వరుసకి అన్నయ్య అయ్యే మా వాడు పొద్దున్నుంచి అరుస్తుంటే ఆ సామెత వదిలా...

నా సామెతనేమీ పట్టించుకోకుండా...ఇదుగో... యావ్వోయ్...ఓ గంటన్నరనుంచి ఓ మొగాణ్ణి అరుస్తుంటే వినిపించుకోవేం...నా జేబులో డబ్బులు తగ్గినయ్...ఎవరు తీశారో చెప్పరే...ఈ నెలజీతం డబ్బులు నెలమధ్యకే అయిపోయాయేవిటీ...చిన్నాడు తీశాడేమొ...వెదవన్నర వెధవ అనరుస్తున్నాడు వాడు. వాడో చిరుద్యోగి.

నాకేం తెలునండీ...అన్నిటికీ ఆడదానిమీదే ఎగరడం మీ మగజాతికింకా వదల్లేదని బదులిచ్చింది మా వదిన వంటింట్లో పప్పు మెదుపుతూనే.

ఎక్కెడెక్కడ తిరిగావో...ఎక్కడ పోగొట్టుకున్నావో నింపాదిగా గుర్తుకుతెచ్చుకోరా...అందరిమీద ఎగరడం దేనికనేసరికి గుర్తు తెచ్చుకోవడం మొదలెట్టాడు మా వాడు... ఆ సగటుజీవి పట్టణ చిరుద్యోగి. జీతంరాంగానే ఇంటద్దె ఇచ్చాను. పెరిగినవార ఇంటద్దె బకాయి కూడా కలిపిచ్చాను. అక్కణ్నించి గ్యాస్ కంపెనీకెళ్లాను. ఆ తరువాత కరెంటుబిల్లు కట్టొచ్చాను. పెద్దాణ్ని కూరగాయలకి పంపాను. పప్పూలూ ఉప్పూలూ నూనె కందిపప్పు మినపప్పులకి తనే వెళ్లాను అని గుర్తుకు తెచ్చుకుంటూ నాతో అన్నాడు.

మినపప్పు నువ్వే తెచ్చావా అని మా వాడిని అడిగా...

అన్నీ తెచ్చి మినపప్పొక్కటీ వేరేవాళ్ళతో తెప్పిస్తానా అన్నాడు వాడు.

వెంటనే మా వదినను...నా ఖండువా మన మినపకాయచేల్లో పడిపోయింది. ఇవ్వాళ చేసిన ఇడ్లీల్లో గానీ దొరికిందా అనడిగా...

అసలే జీతం డబ్బులు పదిహేనో తేదీకే తరిగిపోయాయేంటా అని కిందమీదులౌతుంటే నీ సామెతలూ వెటకారాలేంటిరా అని నా మీద కేకలేయబోయాడు.

అవునురా...నిజంరా....పోయినసారి ఇక్కడకని బయలుదేరా...బస్సెళ్ళిపోతే మెయిన్‌రోడ్డు మీదకొచ్చి బస్సెక్కుదామని మన మిరపసేనుకడ్డంపడి వస్తున్నా...అప్పుడు పై ఖండువా పడిపోయిందిరా...పడింది మినపకాయసేనులో...ఇవ్వాళ మనకోసం టిఫిన్‌గా ఇడ్లీ వేసిందికదా...మినప్పిండి రుబ్బినపుడు నా ఖండువా కనబడిందేమోనని అడిగాలేరా అన్నాను.

వాడికింకా చిర్రెత్తుకొచ్చింది. నా మీద అరవబోయాడు.

రోజులూ ధరలూ పాలకులూ పాలనా విధానాలు వేగంగా మారిపోతున్నాయిరా.. నీ డబ్బులు ఎక్కడపోయాయో అక్కడ వెతుకు. ఇంట్లో వాళ్ళమీద అరవడం దేనికి...కందిచేల్లో పోయిన కర్రు కందిచేల్లోనే వెతకాలి అన్నాన్నేను. ✤

ఈ సంచికలో . . .

ఓరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	5
జీవనశైలి . . .	10
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతిసంగతులు . . .	16
కచేరి . . .	17
ఆరోగ్యం . . .	18
పుస్తక పరిచయం . . .	20
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

'మహాలయ అమావాస్య'

కథ ... 8, 9

'వందేమాతరం' ఆల్బమ్

రియల్‌స్టోరీ ... 14, 15

జల సౌందర్యాల కేరళ

టూరిస్ట్‌గైడ్ ... 21



ఆత్మీయతకు ఆనవాలు ఆచార్య తిరుమల

కళాసాహితి ... 22, 23

ఔరా!

మోనాలిసాపై ఇప్పటికీ ఎన్ని కథలో...!

కోడిగుడ్డుకి ఈకలు ఎన్ని ఉన్నాయో పరిశోధనకే విస్తుబోతుంటే అందుకు కోట్లాదిరూపాయల ఖర్చు మరీ విడ్డూరం కాదూ! ఐదువందల ఏళ్ళక్రితం అరనవ్వే నవ్విన మోనాలిసా చిత్రంపై ఇప్పుడు వింతవింత పరిశోధనలు జరుగుతున్నాయి. రవివర్మకే అందని అందానివో... బాపూ గీసిన చిత్రమా... అంటూ అందం గురించి కవిత్వం, సినిమాగీతాలు కూడా రావడం మనకు తెలుసు. అలా ఓ చిత్రకారుని ప్రతిభ అందానికి కొలమానంగా ఏర్పడ్డం మనకు సుపరిచితమే.. ఆ విధంగా 1550ల్లోనే లియోనార్డో డా విన్సీ గీసిన మోనాలిసా చిత్రం ఇప్పటికీ అపురూపమైన కళాఖండమే. ఆ పెయింటింగ్‌పై ఒకాయిన 25ఏళ్ళపాటు అదేపనిగా పరిశోధించేశాడు. ఆ బొమ్మలో ఆవిడ, లియోనార్డో డా వెన్సీ తండ్రికి స్నేహితుడైన సిల్క్‌వ్యాపారి భార్య మిసెస్ ఫ్రాన్సిస్కో జియోకాండో అని, ఆమె ఐదుగురు బిడ్డలతల్లి అని సదరు పరిశోధన. చిత్రంలోని మోనాలిసాలో డావెన్సీ పోలికలే ఉన్నాయి, చిత్రకారుడే తన రూపాన్ని అలా ఆడపోలికల్లో గీసుకున్నాడు కాబట్టి ఆయన "ఫలానా..." అని మరో పరిశోధన. తోచీ తోయనమ్మ తోడికోడలు పుట్టింటికెళ్లి చేసే పరిశోధనలిట్లాగే ఉంటాయి సుమీ!!

బెగ్గింగే సో బెటరు!

"ఇంత కూరుంటెయ్యమ్మో... ఇంత బువ్వుంటెట్టమ్మో" అని సినిమా పాటగా చూసి కాసేపు నవ్వుకున్నాం. ఢిల్లీ దగ్గర్లోని నొయిడాలో జరిగినదాన్ని చూస్తే ఏమంటారో?! అక్కడ అడుక్కునేవాళ్ళను చూస్తే నొయిడా 'బాబాయిలు' ఊర్కోరు. పట్టుకుని మొదటిసారి ఉద్యోగంలోకి, రెండోసారి కటకటాల వెనెక్కి నెడుతున్నారు. జైలునుంచి వచ్చాక మళ్ళీ భిక్షుకావతారాలే ఎత్తుతున్నారు. పని కల్పించి గౌరవంగా బతకరా బాబూ అంటే ఏంటిలా? ఏంటీ కథ...అని చూస్తే ఔరా! అనిపించవచ్చు. నొయిడా సిటీలోని సెక్టార్ 19వ క్రాసు వద్ద నిలబడి అడుక్కుంటే మధ్యాహ్నావేళకి ఓ ఐదొందలు వస్తాయిట. ఆ ఐదొందలూ బిచ్చగాళ్ళ రింగ్‌మాస్టర్‌కిచ్చేస్తే వాడు ఇతగానికి వంద, నూటయాభై రూపాయలు జీతమిస్తాడు. అలాఅలా కూడబెట్టుకుని అతగాడు తన బీహారులో చిన్న స్థలం కొనుక్కోవాలనుకుంటున్నాడట! పోలీసువారు కుదిరిచ్చిపెట్టిన పనికెళ్లితే ఆ యజమాని రాత్రింబవళ్ళూ చాకిరీ చేయించుకునికూడా యాభైరూపాయలుకూడా ఇవ్వరు, అలాంటి ఘరానా మనుషులను కటకటాల్లోకి తొయ్యాలని బాబాయిలకు అనిపించదంటున్నారు.

ఇంకా పొడుగవుతారంట!

పొడుగ్గా ఉన్న ఫ్రెండ్స్‌ని 'హలో...టీవీ టవర్' అని పిలుస్తున్నారు. అలాంటి టాలెస్ట్ ఫ్రెండ్స్ డచ్ ప్రజలు. ప్రపంచంలోనే పొడగరులు. ఒక బట్టల వ్యాపార సంస్థ ఇటీవల ఎవరెక్కువ గుడ్డ కొంటున్నారనే లెక్క తీసారు. సగటున 185 సెం.మీ(ఆరడుగులొక్కంగుళం) ఎత్తుండే నెదర్లాండ్‌వారే ఎక్కువ కొలత గుడ్డను కొంటున్నారట. బ్రిటిష్, అమెరికా దేశాల వారి సగటు ఎత్తు కంటే నాలుగు అంగుళాలు ఎక్కువే. పాల ఉత్పత్తుల ఆహారబలిమితో ఈ డచ్ అన్నయ్యలు, డచ్ అక్కయ్యలు రాబోయే పదిసంవత్సరాల్లో మరో 4 అంగుళాలు ఎత్తు పెరుగుతారంట. బట్టల కొలతా పెరుగుతోందహో... అని వస్త్ర పరిశ్రమాధిపతులు చంకలు గుద్దుకుంటున్నారు మహదానందంగా... ఆనందం కాదుమరీ...!!

కార్టూన్ కదంబం


సార్, ఇది డెంగ్యూ వార్డు, గుండె జబ్బుల వార్డు అటు పక్కనుండి...
గుండె జబ్బు పిల్లల్ని పరామర్శించిన 'దేశం' నేతలు


రాజీవ్ పల్లెబాటలో వరాలు
పావలా వడ్డీకి రుణం
మూడు నెలల్లో ఉచిత విద్యుత్
గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత


కెసిఆర్, సోనియాను కలిసి వస్తున్నాడు!
తెలంగాణ

భారతదేశం బ్రిటిష్ వారి నుండి విముక్తమై యాభైఏడేళ్ళు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన, దేశ మేధస్సు మన దేశానికే వినియోగించుకోగలగడం అనేది సంపూర్ణంగా ఒనగూరనే లేదు. ప్రపంచీకరణ నేపధ్యంలో మేధోప్రవాహాన్ని (బ్రెన్‌డ్రైన్) దాని ప్రవాహవేగాన్ని పెంచిన విదేశీ ఉపాధి కేంద్రాలపై ప్రత్యేక కథనం ఈ వారం అందిస్తున్నాం.

"విదేశాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాలకు మమ్మల్ని సంప్రదించండి"... "జాబ్ గ్యారంటీ... జాబ్ ఓరియంటెడ్ కోర్సులకు రండి... విదేశీలకు ఎగ్గిరిపోండి" ఇలా రకరకాల కన్సల్టెన్సీ సర్వీసెస్‌లు, సెంటర్లు తమ అందమైన బ్రోచర్ల ద్వారా ఆకర్షిస్తుంటాయి. "ట్రక్ డ్రైవర్ల నుండి టెక్నోక్రాట్స్ వరకూ, ఇంటి పనిమనుషుల నుండి ఇంజనీర్ల వరకూ **200** మంది విదేశాలలో పని చేయుటకు అవసరం". ఇలా పేపర్లలో ప్రకటించే కన్సల్టెన్సీ ఏజెన్సీలు తమను వెంటనే సంప్రదించమంటున్నాయి. ధనిక యువతరం ఉన్నత స్థాయీ ఉద్యోగాల కోసం అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ ఫ్రాన్స్‌లాంటి దేశాలకు 'ఫ్లయిట్‌లు' ఎక్కుతున్నారు. దిగువ స్థాయి నిరుద్యోగులు "ఏవన్నా సంపాదించుకురావచ్చు" అనే ఆశతో గల్ఫ్ దేశాలకు, అరబ్ ఎమిరేట్స్‌కు, కువైట్, దుబాయ్‌ల "అవకాశాల నిచ్చెనలు" ఎక్కుతున్నారు.

విదేశీ ఉపాధి కేంద్రాలు

శంకర్

కలిగినవారి బిడ్డలు మోసపోతే లోలోపల ఏడ్చి పైకి కనబడకుండా బాధ పడతారు. లేనోళ్ళు మోసపోతే భోరుమని లబోదిబోమంటారు. ఏవో నాలుగు కేకలు వేస్తారు. డబ్బు తిరిగిస్తానంటే ఎన్నిసార్లు రమ్మంటే అన్నిసార్లు ఆశతో తిరుగుతారు. తమ హోదా పెంచుకోవచ్చుని, "ఫారిన్ రిటర్న్‌డ్" అనిపించుకుందామని, ఆ పేరున తమ కట్నం రేంజ్ పెంచుకోవచ్చని ఊహించేవారు కూడా ఉన్నారు. మన దేశంలో విజృంభించిన నిరుద్యోగం, చదివినదానికి తగ్గ ఉద్యోగావకాశాలు కనుచూపుమేరలో కనిపించడం లేదు. దానితో సుదూర తీరాలకైనా (ఎబ్రాడ్), సముద్రతీరాల కావతలకైనా (ఓవర్‌సీస్) వెళ్ళడానికి సిద్ధపడుతున్నారు. "మా వాడు స్టేట్స్‌లో జాబ్ చేస్తున్నాడు" "మా సెకండ్ సన్ యు.కె.లో సెటిలయ్యాడు. వాడు మమ్మల్నక్కడకు వచ్చేయమని తెగఫోన్‌లూ, ఈ మెయిళ్ళు చేస్తున్నాడు". ఈ విధంగా చెప్పుకోవడం నాగరికతగా పెరిగింది. అది అనుకరణగా మారి ఓ "గాలి" (వేవ్)లా వీస్తోంది.

మీడియా సాధనాల్లో అత్యంతాధునికమైనదైన వెబ్‌సైట్‌లు సాధారణ యువతరం వారి వరకూ అందుబాటులోకి వచ్చాయి. ఇదివరకు ఉద్యోగాన్వేషణకు "వాంటెడ్‌కాలమ్స్" ప్రతీ పత్రికలో ఉండేవి.



"ఎంప్లాయిమెంట్ న్యూస్" అనే పత్రిక చదువు పూర్తయిన వారి చేతుల్లో ఉండేది. ఈ రోజున కంప్యూటర్లలోని ఈ వెబ్‌సైట్‌లు ఉద్యోగావకాశాలను సచిత్రంగానూ, మిరుమిట్లు గొలిపే రీతిలో డిస్‌ప్లే చేస్తున్నాయి. నోరూరించే స్థాయిలో ఈ గాజుతెర కనువిందు చేస్తోంది. "నౌఖరీ డాట్ కామ్" "మేన్‌క్యాంప్ ఎట్ సత్యమ్ డాట్ నెట్ డాట్‌ఇన్", "కార్పొరేట్ ఎట్ మాఫ్వాడాట్‌కామ్", "డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ విసూ గ్లోబల్ ఎడ్యు డాట్ కామ్" ఇలా రకరకాల వెబ్‌సైట్‌లు. వాటిల్లో కెళితే రెండు కళ్ళూ, వాటికి తగిలించుకున్న మరో రెండు కళ్ళూ చాలవు. "సీమాంతరాల్లో ఉద్యోగమా?... కలలు మాత్రమే కనకండి. మా ప్రకటనను చూసి ఉత్తేజితులు కండి. రండి మా వెబ్‌సైట్‌లో ఈ కింది ఆప్షన్‌ను క్లిక్ చేయండి" అని ఆహ్వానిస్తాయి. తమ కన్సల్టెన్సీ ఏజెన్సీల బ్రాంచీల అడ్రస్సులను గుమ్మరిస్తాయి. రాష్ట్ర రాజధానిలో ఉన్న కన్సల్టెన్సీ సెంటర్లు కంప్యూటర్‌లో నమోదైనవే వందకు పైగా వున్నాయి. ఓ బోర్డు, ఓ గది, ఓ కంప్యూటర్ తరహా కన్సల్టెన్సీలకు లెక్కలేదు.

కన్సల్టెన్సీల విజృంభణ :

ఏ దేశానికాదేశం తనకంటూ విద్యావంతుల్ని తయారు చేసుకుంటుంది. బయటకు వెళ్ళి చదువుకునే వాళ్ళు కూడా తిరిగి మన దేశానికి తిరిగొచ్చి ఆ మేధస్సుని తన దేశానికుపయోగించేవారు. ఏదైనా ఓ పెద్ద సంస్థ తన ఉద్యోగిని మరింత నైపుణ్యం కోసమని కూడా విదేశాలకు పంపిస్తుంటుంది. పెట్టుబడిదారీ దేశాలు, సంపన్న దేశాలు తమకు కారుచౌకగా పని చేసే కార్మికుల కోసం, తక్కువ జీతాలకు దొరికే టెక్నోక్రాట్ల కోసం వల (నెట్) వేసింది. దేశంలోని ప్రముఖ యూనివర్సిటీల్లోని విద్యార్థి యొక్క సెమిస్టర్ల స్థాయిలోనే మెరికలను చూసి ఎంపిక చేసుకుంటున్నారు. ఇక ఇప్పుడు చదువంటే ఎంసెట్టేననీ, జ్ఞానమంటే కంప్యూటర్లేనని, ఉద్యోగమంటే ఫారిన్‌లోనేననే భావనలు పెరిగాయి. ఒకానొక విదేశీ వ్యామోహం "నాగరికత"గా ముందుకొచ్చింది.

1997 నుండి ఇంటర్నెట్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల యొక్క ప్రాముఖ్యత ఒక్కసారిగా పెరిగింది. సరిగ్గా అదే రోజులలో 2000వ సంవత్సరమంటే కంప్యూటర్లకు ఒళ్ళంతా కంపరమెత్తి పోయింది. చివరి రెండంకెలు 99 ఉన్న 1999 తరువాత వచ్చే 2000వ సంవత్సరంలోని చివరి రెండు సున్నాలకు హడలెత్తి పోయింది. కంప్యూటర్ ఆధారిత దినచర్యలూ, వ్యాపార లావాదేవీలు, జీతభత్యాల, బ్యాంకు ఎక్కౌంట్ల అంకెల జాతకాలు, ఆఖరికి లిఫ్టులూ,ఆటోమేటిక్ డోర్ల లాక్ సిస్టమ్‌లు అన్నింటా ఓ ప్రళయం సంభవిస్తుందనే భయం దద్దరిల్లిపోయింది. దాన్ని 'వైటుకె(వై2కె) ప్రోబ్లమ్' అన్నారు. వైటుకె ప్రోబ్లమ్ సొల్యూషన్ అనే పెను వ్యాపారం 1998-2001ల మధ్య సాగిన కాలం "ది రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ఐ.టి.బూమ్" అని కూడా ఈ కాలాన్ని అనవచ్చు. ఈ సొల్యూషన్ ప్రోగ్రామ్‌కి వేలకొలది కంప్యూటర్ కూలీలు కావాల్సి వచ్చారు. లెక్కలేనన్ని కన్సల్టెన్సీ సెంటర్లు ఏర్పడటానికి ఈ "సందర్భం" బాగా తోడ్పడింది.

ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కన్సల్టెన్సీ సెంటర్లగా ఛేంజ్ :

ప్రభుత్వ శాఖ అయిన ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ నిర్వీర్యమైపోవడం మరో ముఖ్యమైన కారణం. పాలకులనుసరించే అస్తవ్యస్త విధానాల ఫలితంగా చదువు పూర్తయిన వారికి తగ్గ ఉద్యోగావకాశాల కల్పన చేయలేకపోయింది. అంతర్జాతీయ పరిణామాలకు తలొంచి ఉద్యోగాలే కుదించివేశాక పరిస్థితి ఊహించలేనంత స్థాయికి నిరుద్యోగం ఎదిగిపోయింది. ప్రపంచీకరణ మంత్రం "హోంఫట్" అనగానే "ప్రపంచం ఒకే ఒక కుగ్రామంగా" మారిపోయిందట! నిరుద్యోగానికి ఉద్యోగం చూపించే స్థితి లేకుండా అయిపోయింది. ఆ స్థితిలో దేశంలోనూ, విదేశాల్లోనూ ఉద్యోగాలు చూపించే సంస్థలు ప్రయివేటు రంగంగా ఏర్పడ్డాయి. ఆయా కంపెనీలు క్లయింట్‌లుగా ఈ సంస్థల్ని సంప్రదిస్తే... వారికి తగ్గ కాండిడేట్లను కుదిర్చిపెట్టే "ఎక్స్ఛేంజ్" సర్వీసులుగా ఇవి ఏర్పడ్డాయి.

"ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్" ఉరఫ్ "కన్సల్టెన్సీ సెంటర్లు" :

"స్టడీస్ ఇన్ ఎబ్రాడ్", "ప్లేస్‌మెంట్స్ (ఇన్ ఎబ్రాడ్, గల్ఫ్, వితిన్ ది కంట్రీ) కన్సల్టెన్సీ సర్వీస్ సెంటర్లు" అని రెండు విధాలుగా విడివిడిగా వున్నాయి. కొన్ని ఈ రెండు పనులూ చేసిపెట్టే ఒకే సంస్థగా వున్నాయి. చదువులు పేరిట వెళ్ళిన వాళ్ళు ఆ కోర్సులు పూర్తయ్యేలోపు అక్కడే సెటిలయ్యే మార్గం కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. 500 రకాల ప్రోగ్రామ్, గ్రాడ్యుయేషన్ ప్యాకేజీలున్నాయి. బయోఇన్ఫర్మేటిక్స్, నెట్‌వర్కింగ్ & కంట్రోల్ సిస్టమ్స్, ఓషనోగ్రఫీ, పబ్లిక్‌హెల్త్, స్పీచ్ పాథాలజీ, ఫిజియోథెరపీ లాంటి కోర్సులకు కొందరు కన్సల్టెన్సీల వారున్నారు. కంప్యూటర్, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, అప్లయిడ్ సైన్స్, నర్సింగ్, సైకాలజీ, ఎక్కౌంటింగ్, హెల్త్‌సైన్స్, తదితర కోర్సులకు పంపుతామని తమ పాకేజీలు మరికొన్ని సంస్థలు ఇస్తున్నాయి. ఈ కోర్సుల చదువు పేరిట యువతరాన్ని అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, బెల్జియం, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సైప్రస్, సింగపూర్ లాంటి చిన్నాపెద్దా దేశాలకు చేరుస్తున్నారు. అక్కడకు చేరాక, అక్కడి విద్యాబుద్ధులు నేర్చాక, అక్కడి నీళ్ళు వంటబట్టాక తన స్టూడెంట్ వీసాను, జీవితకాల వీసాగా.... గ్రీన్‌కార్డు హోల్డరుగా స్థిరపడిపోతారు. ఇదొక "మేధో ప్రవాహం" (బ్రెయిన్ డ్రెన్). ఇక్కడే రకరకాల కోర్సులు చదువుకుని ఆ చదువులకెక్కడ డిమాండుందో ఆ దేశాలకు ఉద్యోగం చూపెట్టమని కోరేవాళ్ళకు ప్లేస్‌మెంట్స్ ఇవ్వడం మరోవిధమైన "మేధోప్రవాహం".

కన్సల్టెన్సీ సెంటర్ల పాత్ర :

ఈ "సంప్రదింపుల కార్యాలయాలు" పెద్ద నగరాల్లో ఉన్నట్లే హైదరాబాద్-సికింద్రాబాద్‌లో కూడా అనేకం ఉన్నాయి. చాలా వాటికి విదేశాల్లో విద్యా సంబంధమైన కన్సల్టెన్సీలనే అర్థం వచ్చే బోర్డులున్నాయి. మరికొన్ని విదేశీ కరెన్సీ మార్పిడి సహాయ కేంద్రాలు లాగా, ట్రావెల్ ఏజెన్సీలు మాత్రమేనన్నట్లున్నాయి. మరికొన్ని "జాబ్ గ్యారంటీ మేనేజ్‌మెంట్ కోర్సులు చెప్పబడును" లాంటి ప్యాకేజీ స్టడీస్‌కు చెందిన బోర్డులున్నాయి. "మనుషులను అమెరికాకో... ఇతర దేశాలకో తరలించే లోకల్ ఫ్రాంచైసీలు ఈ కన్సల్టెన్సీ సెంటర్లు. మిగులు ధనం ఆస్తిగా గల కుటుంబాల్లోని వారు స్కిల్డ్ జాబ్‌లకు, మామూలు వాళ్ళు అన్‌స్కిల్డ్ "బ్లూ కాలర్డ్" జాబ్‌లకు వెళుతున్నారు" అని ఉద్యోగరీత్యా అమెరికా వెళ్ళి వచ్చిన రవి (అమెరి'కాలం'లో... పుస్తక రచయిత) అంటున్నాడు. "విసూ కన్సల్టెంట్స్" "మాఫ్వా మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్", "టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్", బ్రెయిన్ ట్రీ", "విక్టోరియా", "జేడ్", "టిఎంఐ" లాంటి ప్రముఖమైనవిగా కొంత మేలైన సేవలు అందిస్తున్నాయి.



ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ నిర్వహించాల్సిన విధులు ఈ కన్సల్టెన్సీ సెంటర్లు చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు, కార్యాలయాలు తమకు కావాల్సిన సిబ్బంది గురించి వీరికి

అది సికిందరాబాద్‌లోని ముఖ్యమైన చౌరస్తా. పది పదహారకు షాపులు ఆవులిస్తూ తెరుచుకుంటున్నాయి. సోఫిస్టికేటెడ్ ఘరానా వ్యాపారంలా తయారైన విదేశీ ఉద్యోగాల కన్సల్టెన్సీ కార్యాలయం కూడా నోరు తెరిచింది. "ఇక్కడ మోసం జరుగును" అని ఏ కోశానా అనిపించనంత అందంగా ఉంది. ఏంటిలా చేశారు అని అడగలేనంత హోదాగా కనబడుతోంది. రిసెప్షన్, వెయిటింగ్ హాల్, స్ప్రింగ్‌డోర్లు, కార్పెట్లు, పెర్ఫ్యూమ్‌ల గుభాళింపులతో అదిరిపోతోంది. తమ పేరు పిలుపుకోసం ఎదురు చూసే బకరాల్లా కాండిడేట్లు. వారిలో ఒక అభ్యర్థి మురుగేశన్ (పేరు మార్చాం). ఈ కన్సల్టెన్సీ ప్రకటనకు ఆకర్షితుడై వచ్చాడు. కన్సల్టెన్సీ అప్లికేషన్‌కు రు. 200లు. తాను కోరిన ఉద్యోగానికి ఈమెయిల్, ఇంటర్నెట్టుల టెలిఫోనిక్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూలకై 45 వేల రూపాయలు. వీసా, ఫ్లైయిట్ టిక్కెట్లకై మరో లక్షన్నర రూపాయలు మొత్తం రెండున్నర లక్షల రూపాయలు చెల్లించాడు. ఫారిన్‌లో టీచర్‌ఉద్యోగం ఖాయమైందనీ, మరోనెలలో అపాయింట్‌మెంట్ ఆర్డరు, రెండో నెలలో వీసా, విమానం టిక్కెట్ ఇస్తానన్నారని ఈ వ్యాసకర్తతో చెప్పాడు. ఈ వ్యాసం రాసేనాటికి ఈ వ్యవహారం ఎనిమిది నెలలుగా సాగుతోంది. ఇంకెన్ని నెలల పాటు ఈ ఎపిసోడ్ సాగుతుందో అతని నోటి "ధాటి"ని బట్టి ఉంటుంది. "యూ ఆర్ అపాయింటెడ్ యాజ్ ఏ టీచర్ ఇన్ ఆస్ట్రేలియా" అని ఓ అపాయింట్‌మెంట్‌ఆర్డరు కూడా మురుగేశన్ చేతికిచ్చారు. ఆ ఉద్యోగం ఆస్ట్రేలియాలో ఏ ఊళ్ళోనో ఏ స్కూల్లోనో అందులో లేదు.

చెబుతారు. తమ వద్ద నమోదై వున్న వాళ్ళలోంచి సెలెక్ట్ చేసి ఆయా సంస్థలకు పంపిస్తారు. ఈ నియామకాలను ఈ కన్సల్టెన్సీ సెంటర్లు కొన్ని రకాలుగా విభజించారు. "హెచ్ ఆర్ సర్వీసెస్" (హ్యూమన్ రిసోర్సెస్) అని అంటున్నారు. స్టాఫింగ్ సొల్యూషన్స్ పేరిట పర్మినెంట్ ఉద్యోగులుగా, షార్ట్‌టైమ్ ఉద్యోగులుగా, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా 'ప్లేస్‌మెంట్స్' ఇప్పిస్తున్నారు. "పర్మినెంట్ స్టాఫింగ్, ఫ్లెక్సిబుల్ స్టాఫింగ్, అసెస్‌మెంట్ స్టాఫింగ్ అనే మూడు విధాలైన ఉద్యోగులను మా క్లయింట్లకు సమకూర్చిపెడుతున్నాం. ఇప్పటికి 25,000 మందికి ప్లేస్‌మెంట్ ఇచ్చాం" అని "మాఫ్వా మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ లిమిటెడ్" హైదరాబాద్ బ్రాంచి కోఆర్డినేటర్ బి.వి.ప్రసాద్ అన్నారు. ఈ సెంటర్లకు వెళ్ళిన నిరుద్యోగులు ముందు కొంత ఫీజు కట్టి నమోదు అవుతారు. వారు కోరిన ఉద్యోగానికి చెందిన కోర్సులను, క్రాష్ కోర్సులను, పేకేజీలను ఈ సెంటర్లే అందిస్తాయి. కెరీర్ డిజైన్, పర్సనల్ డెవలప్‌మెంట్, అడ్వాన్స్ కోచింగ్‌లు ఇలా రకరకాల పేర్లతో ఉంటాయి. ఈ కోర్సులు ప్రధానంగా అమెరికా లేదా ఇతర దేశాల మార్కెట్టులో తాజాగా వచ్చిన రిక్వైర్‌మెంట్స్‌ను బట్టి, కొత్త ట్రెండ్‌ను బట్టి ఈ కోర్సులను, ఎడ్యు-పాకేజీలను ప్రవేశపెడుతున్నారు. ఈలోపున వచ్చే పిలుపులతో ఆయా అభ్యర్థులకు ఇంటర్నెట్, ఆన్‌లైన్, టెలిఫోనికల్ ఇంటర్వ్యూలు జరుగుతాయి. సెలెక్ట్ అయ్యాక వారికి డాక్యుమెంటేషన్, వీసా, ఫ్లైయిట్ టిక్కెట్ అన్ని లేదా కొన్ని చూసిపెడతారు. ఇక అప్పుడు ఎగిరివెళ్తారు. ఈ క్రమం అంతా ఒక నెల నుండి సంవత్సరం లోపు సమయం పడుతుంది. ఇందుకు రెండున్నర లక్షల నుండి మూడు లక్షల వరకూ వసూలు చేస్తారు. అటు క్లయింట్ల వద్ద నుండీ ఫీజులు భారీగా బిల్లు వేస్తారు. ఒక్కోసారి ఈ కన్సల్టెన్సీలకు 50 నుంచి 100 మంది ఉద్యోగులు వెంటనే కావాలి అని పెద్ద ఆర్డర్లు వస్తుంటాయి. ఈ ప్లేస్‌మెంట్ తీరుల్లో ఇటీవల ఓ పెద్ద మార్పు సంభవించింది. కాంట్రాక్టు పద్ధతిలో తమ కార్యాలయపు పని చేసి పెట్టే ఔట్ సోర్సింగ్ విధానం ప్రస్తుత ట్రెండ్. ఇలాంటి పనులు చేసి పెట్టే "కాల్‌సెంటర్లు" యూరో ఇప్పటి ఉద్యోగరూపం. ఇలాంటి వాటికి వచ్చే ముఖ్యమైన ప్రాజెక్టు – "పే-పేకేజీ". అనేక కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లోని జీతభత్యాలకు చెందిన ఎకౌంటింగ్ పని. ఆ వర్క్ ప్రాజెక్టు పనికి మధ్యవర్తిత్వాలు కూడా ఈ కన్సల్టెన్సీల పనైంది.



కన్సల్టెన్సీలు.. కనికట్టు మాయలు :

ఆకర్షణీయమైన బ్రోచర్లతో, మంచి ఇంగ్లీషు వాగ్ధాటితో బుట్టలో వేసుకున్న కాండిడేట్లను రకరకాల ఫీజుల రూపంలో వేలల్లో డబ్బు కట్టించుకుంటారు. ఏదో ఒక రకపు వీసా (ఒక్కోసారి టూరిస్టు వీసాని) ఇప్పించేసి అమెరికాలో మా కంపెనీ మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటుంది పొమ్మంటారు. అక్కడ ఎవరో ఒకాయన రిసీవ్ చేసుకుని "వెయిటింగ్"లో ఉంచుతారు. ఆ దశను "బెంచ్" అంటారు. స్టాండప్ ఆన్ ది బెంచ్‌లాగా! అక్కడకెప్పుడు పిలుపొస్తుందో, అసలు వస్తుందో రాదో కూడా తెలియదు. కొంతమంది బెంచ్ దశ నుంచీ తిరిగొచ్చేసిన వాళ్ళుంటారు. ఇంకొందరు ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచే వెనుదిరిగి వచ్చేస్తారు. అంత "పనితనం" చూపిస్తారు ఈ కన్సల్టెంట్‌లు. దానితో కొంతమంది ఎదురు తిరిగి డబ్బులు వాపసివ్వమని అడిగితే కొద్దికొద్దిగా ఇస్తే ఇస్తారు. అప్పటికే ఆ డబ్బులు వేరే బిజినెస్‌ల్లో ఫైనాన్స్ వ్యాపారానికి వెళ్ళిపోయుంటాయి. విదేశీ ఉద్యోగాల కోసం, రాబోయే డాలర్ల, గల్ఫ్‌దేశాల సంపాదనకు ఆశపడి ఉన్నవన్నీ అమ్ముకుని ఈ కన్సల్టెంట్లకు ఇచ్చి దారుణంగా మోసపోయిన వారు అనేకమంది ఉన్నారు. ముఖ్యంగా పనిమనుషులుగా, ట్రక్కు డ్రైవర్లుగా, కార్పెంటర్లుగా, కన్‌స్ట్రక్షన్ పనివారుగా అన్‌స్కిల్డ్ జాబ్‌లకు వెళ్ళేవారు ఈ మోసాలకి గురవుతున్నారు. ఇటీవలి అమెరికా యుద్ధ విధ్వంసం వల్ల ఇరాక్‌లో నాశనమైన ప్రాంతాల పునర్నిర్మాణ కాంట్రాక్టు పనులకు అమెరికన్ కంపెనీలు సిద్ధమయ్యాయి. వాటికి కావాల్సిన మాన్‌పవర్ సప్లయర్స్‌గా కొత్త మార్కెట్ అవసరం వచ్చింది. అందుకు మనలాంటి దేశాల్లోని కన్సల్టెన్సీ సెంటర్లు మనుషులను పంపుతున్నాయి. వారం క్రితం ఇరాక్‌లో భారతీయ డ్రైవర్ల కిడ్నాప్ సంఘటన ఈ కన్సల్టెన్సీలకు చెందిన ఓ విషయాన్ని బయటపెట్టింది. "కువైట్‌లో పని అనిచెప్పి ఇరాక్‌కు మమ్మల్ని పంపించారు ఆ ఏజెన్సీవారు" అని కొందరు చెప్పడం ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించింది.

"విదేశాల్లో ఉద్యోగం కోసం లక్షరూపాయలు ఫీజుగా చెల్లించడానికి సిద్ధపడ్డవారు... ఓ రెండు వేలు పెట్టి ఆయా కంపెనీలకి ఫోన్ చేసి నిజమా కాదా అని నిర్ధారించుకోవాలి. అలా చేస్తే ఇలాంటి మోసాలకి గురి కాకుండా చూసుకోవచ్చు" అని మాఫ్వాకి చెందిన బి.వి.ప్రసాద్ అంటున్నారు.

ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి నిర్వీర్యమవ్వడం ఇలాంటి సంస్థలేర్పడాల్సిన పరిస్థితిని కల్పించింది. వీటిలో రిజిస్టర్డ్, ప్రభుత్వ అజమాయిషీలో వున్న సంస్థలు గాకుండా పుట్టగొడుగుల్లాంటివి అనేకం ఉన్నాయి. వాటిపై ఎలాంటి నియంత్రణా లేకపోవడం విచారించదగ్గ విషయం. ఇప్పటికైనా మోసపూరిత కన్సల్టెన్సీ సంస్థల తిమింగలాల బారిన పడకుండా నిరుద్యోగులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకుంది. ❖

'మహాలయ అమావాస్య'

ఏ అనుభూతికి లోనవ్వని ఓ రకమైన నిర్లిప్తత ఆ స్థితిలో మనసుని ఆవరింపచేస్తోంది. గత స్మృతులు నెమరువేత తప్ప ఇంకేం చేయలేని నిస్సహాయ స్థితి అది. అలాంటి స్థితి ఎభై ఎనిమిదేళ్ళ వయసులో నాకు వచ్చింది కాబట్టి ఈ కథని మీ ముందు ఉంచుతున్నాను.

కాండ్రేగుల శ్రీనివాసరావు

నా జీవితంలోనే కాదు, ఏ వ్యక్తికైనా గుర్తుంచుకోతగ్గ ఆనందమైన క్షణాలు ఏవైనా ఉన్నాయి అంటే, అవి బాల్యానికి చెందినవే అయి ఉంటాయి.

నాకు పది సంవత్సరాల వయస్సున్నప్పుడు, పొలంలో గల బావిలోకి నన్ను అమాంతంగా విసిరేశాడు నా తండ్రి. ఈత రాక నీళ్ళలో కొట్టుమిట్టాడుతూ నేను ఉక్కిరి బిక్కిరి అవుతుంటే, నా పక్కనే నీళ్ళలోకి దూకి నన్ను తన వీపుమీదకి చేర్చుకుని నాలో భయాన్ని పారద్రోలుతూ నాకు ఈత నేర్పేవాడు.

ఇంకాస్త పెద్దయినాక తనతో చెడుగుడు ఆడమని పందెం వేసి కవ్వించేవాడు. తమ జట్టు కుర్రాళ్ళంతా ఒక వైపు ఉండి తండ్రిని ఓడించాలనే పంతంతో ఎన్నిసార్లు ఆడినా సరే అతన్నిగెలవడం అనేది అసాధ్యమయ్యేది. నిజంగా ఆయన ఎంత చక్కగా ఆడేవాడని? ఆనక తన జట్టు అందరికీ తాటితాండ్ర కొనిపెట్టేవాడు.

తాడితాండ్ర అంటే నాకు వల్లమాలిన ఇష్టం. అందుకే ఏ ఆటలోనైనా తాటితాండ్రని ఎరచూపుతూ కవ్వించేవాడు. మేమిద్దరం తండ్రీకొడుకుల్లా కాకుండా స్నేహితుల్లా కలిసిమెలసి తిరిగేవాళ్ళం.

అంతేకాదు మా తాతయ్యఅంటే నాన్నకి ఎనలేని ప్రేమ.

ఎప్పుడైనా ఇంట్లో తాతయ్య మీద మేము చిరాకు పడితే నాన్నకి విపరీతమైన కోపం వచ్చేది. మమ్మల్ని తీవ్రంగా మందలించేవాడు. తన ముందు తరాన్ని గౌరవించటమే కాకుండా ప్రేమ, ఆప్యాయతల్ని పంచి ఇవ్వటం, కుటుంబ విషయాలూ, డబ్బుకి సంబంధించిన విషయాలూ అందరూ కలిసి చర్చించుకోవటమూ కష్ట సుఖాల్ని అంతా సమానంగా స్వీకరించటం మొదలైన ఆ జీవన విధానంలో ఓ చక్కని కమనీయత కనిపించేది.

తాతయ్యకి పొగాకు నిండుకుంటే ముప్పై కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కుతూ వెళ్ళి నాణ్యమైన పొగాకుని నాన్నే స్వయంగా కొని తెచ్చేవాడు. అది పుచ్చుకున్నప్పుడు తాతయ్య - 'ఎందుకురా అంత శ్రమ ఎప్పుడో అటువైపు వెళ్ళే వారిచేత రప్పిద్దునుకదా...' అని అంటున్నప్పుడు తాతయ్య కళ్ళలో పుత్రవాత్సల్యం, నాన్న మొహంలో కదలాడిన సంతృప్తి నాకు ఈనాటికి కూడా గుర్తున్నాయి.

నాన్న ఏనాడు కూడా జీవితాన్ని చేజార్చుకోలేదు. జీవితాన్ని అతని అధీనంలో ఉంచుకుంటూ ఆ అనుభవ పరిమళాన్ని మా అందరికీ పంచి ఇచ్చేవాడు. సంతతికి ఏ లోటు చేయలేదాయన. నాకు మంచి ఉద్యోగం అంతన్త ఆస్తి అన్నీ సమకూర్చాడు.

అమ్మ మరణం తరువాత నాన్నని వంటరిగా వదిలేయక నా దగ్గరకు తీసుకొచ్చాను. నా భార్య నిరాదరణగా చూడటం నా పిల్లలు నిర్లక్ష్య వైఖరితో అతన్ని బాధించటం నా కళ్ళ ముందు జరిగేవి. భార్యపిల్లల్ని చెప్పుచేతలో ఉంచుకోలేని నా అశక్తతని మాట వరుసకైనా నిందించలేదు అతను. వీటన్నింటినీ అధిగమించే నిర్ణయం నాన్న తీసుకున్నాడు.

ఇంట్లో ఎవరికీ ప్రతిబంధకం కాకుండా పరిష్కారాన్ని చూసుకుంటూ తన జీవితాన్ని ఆశ్రమానికి అంకితం చేస్తూ నాన్న వెళ్ళిపోయినప్పుడు బాణం తగిలిన పక్షిలా విలవిలలాడిపోయాను. నాన్న అలా చేయకుండా నన్ను చెప్పుతో కొట్టి ఉన్నా సరే అంత బాధపడి ఉండేవాడిని కానేమో... క్షమించాలి. నా కథ అంతా ఎకరువు పెడుతూ మిమ్మల్ని విసిగిస్తున్నట్లున్నాను. ఇదంతా చెప్పటానికి ఒక కారణం ఉంది. నాలుగు రోజుల క్రితం మా ఇంట్లో జరిగిన సంగతిని చూడండి.

* * *

'డాడీ, ఇంట్లో వాడైనా ఉండాలి. నేనైనా ఉండాలి. ఈ విషయం ఇవ్వాళే అటోఇటో తేలిపోవాలి.'

'ఒరేయ్! వాడేమైనా నీ శత్రువా? మాటిమాటికీ వాడైనా ఉండాలి నేనేనా ఉండాలి అంటావ్'

'అదిగో వాడ్ని వెనుకేసుకురావడమే నీ పని. నేనే కానివాడ్ని అన్నమాట! అలాంటప్పుడు నేను మాత్రం ఉండిదేనికి? నాకు రావల్సిందేదో పంచెయ్. నా దారి నేను చూసుకుంటాను'

'ఇంటికి పెద్దకొడుకువనే మాటేగాని కాసింతైనా లోకజ్ఞానం లేదు నీకు

'అదంతా వద్దు డాడి! మీతో నాకిక నప్పదు. నా వాటా మర్యాదగా ఇస్తే సరి! లేదా ఎలా రాబట్టుకోవాలో నాకు తెలుసు'

'డాడీ! వాడితో మనకి వాదనలెందుకు? చిల్లిగవ్వ కూడా ఇచ్చేది లేదు ఇంట్లో నుంచి పొమ్మను'

ఒరేయ్ చిన్నీ! నువ్వు కాస్త ఆగుతావా? నేను మాట్లాడుతున్నాగా.. ఛ... ఛ... కొంపలో మనశ్శాంతి లేకుండా చేసేస్తున్నరర్రా..."

'మనశ్శాంతా? ఇంకా ఇపుడేం జరిగిందని? రేపు చూడు లాయర్ నోటీసు వస్తుంది. ఇహ చూస్కోండి... మీ తండ్రీ కొడుకులిద్దరికీ అసలైన మనశ్శాంతి అపుడు కరువవుతుంది. ఈ క్షణం నుంచి ఆ పనిలోనే ఉంటాను. గుడ్ బై..' విసురుగా వెళ్ళిపోతున్న పెద్ద కొడుకువైపు చూస్తూ నివ్వరపోయాడు అతను.

'ఏమిటి డాడీ! నువ్విలా డీలా అయిపోతున్నావు. వాడి సంగతి తెలిసిందే కదా! అందుకే అర్జెంటుగా వీలునామా రాసేయ్ డాడీ! చౌరస్తాలో కాంప్లెక్స్ చిన్నోడ్ని కాబట్టి నాకు, ఓల్డ్ టౌనులో ఇల్లు వాడికీ. మన ఊరిలో పొలాలు వాడికీ, సిటీలో సైట్స్ నాకూ రాసేయ్. వాడి మొహాన ఏ కాస్తో పడేసి, ఎలాగూ మీరు నాతోనే ఉంటారు కాబట్టి ఓ పది లక్షలు అదనంగా నాకు కలిసేటట్టు వీలునామా రాసేసి రిజిస్ట్రేషన్ చేయిస్తే పోలా... ... ...'

తండ్రి తనలో తానే నవ్వుకున్నాడు.

తన కొడుకులిద్దరూ ఎంత ఎదిగిపోయారు.

వీడు లేనప్పుడు వాడు చెప్పేది, వాడు లేనప్పుడు వీడు చెప్పేది ఒక్కటే సారాంశం. స్వార్థం సోదర ప్రేమను ఎప్పుడో కబళించేసింది.

తమకి విచారాన్ని కాక సంతోషాన్నిచ్చే పిల్లలున్న తల్లిదండ్రులు అదృష్టవంతులట!

తనకి ఆ అదృష్టం లేదు మరి! ఇలాంటి స్థితిలో ఆస్తిని పంచేస్తే రేపు తన కూతురి – భవిష్యత్తు మాటేమిటి? తమ భార్యభర్తల పోషణ సంగతేమిటి?

* * *

ఈ సన్నివేశంలో తండ్రి పాత్రదారుడ్ని నేనే!

నా తండ్రితో నేను గడిపిన దానికి భిన్నంగా నా పిల్లలు ఉండటం మీరే చూశారుగా. వాళ్ళకి కుటుంబ సభ్యులు అక్కరలేదు. ఆస్తి అంతస్తు కావాలి. అవి ఇచ్చే సుఖాలు కావాలి. వాటికోసం ఎందర్ని బాధించటానికైనా వెనుకాడరు.

నా పిల్లలు ఇలా ప్రవర్తించినపుడల్లా మా తండ్రి తాలూకు నాటి ఆస్తి పంపకం నాకు గుర్తుస్తూనే ఉంటోంది. ఎంత వద్దనుకున్నా సరే ఈ రెండు సంఘటల్ని పోలిక చేసే ఆలోచన్లు నా మదిలో మెదలుతూనే ఉంటాయి. మనశ్శాంతి లేకుండా చేస్తూనే ఉంటాయి.

ఆనాడు... ... ...

* * *

ఆ గదిని మొత్తం స్తబ్ధత ఆవరించుకుని ఉంది.

అందరి ముఖాలు బాధా ఉద్వేగంతో నిండి వున్నాయి.

మడత కుర్చీలో గంభీర వదనంతో కూర్చొని వున్న పెద్దాయన నోట్లో చుట్టని తీసి, నుసిని నేలమీదకి దులిపాడు. అనంతరం దాన్ని పెదాల మధ్యకు చేర్చి, గుప్పున గుప్పున పొగపీల్చుతూ వదలసాగేడు.

అతని మనసులో అల్లకల్లోలాన్ని గింగుర్లు తిరుగుతున్న పొగ ప్రస్ఫుటం చేస్తోంది.

ఎదురుగా ఇద్దరు కోడళ్ళు మనవలు మనువరాళ్ళు బిక్కమొహాలు వేసుకుని వున్నారు. పెద్దకొడుకు దీనంగా గోడకానుకుని నిల్చున్నాడు.

తండ్రికి అతిచేరువలో కూర్చొని వున్న కొడుకు నిశ్శబ్దాన్ని ఛేదించాడు.

'ఇప్పుడేమైందని? ఉమ్మడి కుటుంబం అన్నాక అనేకం వస్తూ వుంటాయి. అంతమాత్రానికే ఇల్లు రెండు ముక్కలు చేయాల్సిన అవసరం ఇంత అర్ధాంతరంగా ఏం వచ్చిందని' అడిగాడు తండ్రిని కాస్త హెచ్చుస్వరంతో

ఆయన సమాధానం చెప్పలేదు. చుట్టకాల్చటంలోనే నిమగ్నమై వున్నాడు.

తల్లి కలుగజేసుకుని చెప్పసాగింది.

'మీరిద్దరూ రామలక్ష్మణులనీ మాకున్న రెండు కళ్ళు అనీ అనుకునే వాళ్ళం ఇన్నాళ్ళు. పిల్లల దగ్గర తోడికోడళ్ళ దగ్గర అనేక వ్యత్యాసాలూ రాజుకుంటూనే వున్నాయి. అపోహలుతోనూ అపార్థాలతోనూ కొంపలో మనశ్శాంతి కరువైపోతుంది. ఒకరిమీద ఒకరికి ఈర్ష్య, అసూయలు రాకముందరే ఎవరిమానాన వారుంటే బావుంటుంది. కలిసి ఉండి విడిపోయేకన్నా, విడిపోయి కలిసుండటం మంచిది కదా!' అంది ఆమె.

పెద్దాయన భార్యవైపు సాలోచనగా చూశాడు.

అతని ముందు అంతలా ఆమె మాట్లాడటం ఇదే ప్రథమం. అలా అని ఆమె మాటల్లో అవాస్తవం కూడా లేదు. 'అమ్మా నువ్వెన్ని చెప్పినా సరే ఇలా విడిపోవటం నాకైతే ఇష్టం లేదు.' చిరాకుగా చెప్పాడు చిన్నకొడుకు.

'అలా చెప్పరా తమ్ముడూ.. రేపట్నుంచి మనిద్దరమూ పరాయివాళ్ళలా ఏరా అంటే ఏరా అని పలుకరించుకోవడమేనా? ఇంట్లో ఆడాళ్ళు తిని ఉండలేక సతాయిస్తున్నారు. ఇల్లుని ముక్కలు చేస్తున్నారు' పెద్దకొడుకు చెప్పాడు గద్గదికంగా.

'ఏది ఏమైనా పిల్లలిద్దర్నీ వేరే పెట్టాల్సిందే. ఎపుడూ ఏవో వ్యాపకాలతో బయట తిరిగే మగాళ్ళకి ఇంట్లో కాలే రావణకాష్టం గురించి ఏం తెలుస్తోంది. మధ్యలో నలిగే దానను నేనేగా! ఏం చేస్తారో ఎలా పంచిస్తారో మీ ఇష్టం. కానీ ఇద్దర్నీ మాత్రం తప్పక వేరుపెట్టి తీరాల్సిందే... ఇంత సేపట్నుంచి మొత్తుకుంటున్నా నా గోడు వినటమే గానీ మీరేమి మాట్లాడరేమిటి?' భర్తతో అంది ఆమె.

పెద్దాయన కుర్చీలోంచి ముందుకు కదిలి అందరి వంక పరిశీలనగా చూశాడు. గొంతు సర్దుకుని మాట్లాడటానికి ఆయుత్తమవసాగేడు.

'ఇంతసేపు నుంచి ఇందరం మాట్లాడుతూ ఉన్నాసరే మేము కలిసే ఉంటాం అని మీ భార్యలిద్దరితో ఏ ఒక్కరూ అనకపోవడం విడిపోవడం పట్ల వాళ్ళకున్న ఇష్టాల్ని బట్టబయలు చేస్తోంది. మీ అమ్మ ఈ విషయమై సంవత్సరం నుంచి నన్ను పోరుతూనే ఉంది. ఇంతదాక వచ్చినాక ఇక ఆగడం దేనికి? ఈ పరిస్థితి ఎప్పుడో నా తదనంతరం వస్తుందనుకున్నాను. కానీ నేను బతికుండగానే పంపకం చేయాల్సి వస్తుందనుకోలేదు..."

గుక్క తీసుకోవటానికి కాసేపు ఆగి మళ్ళీ ప్రారంభించారాయన.

'రేపు వీలునామా రాసే ఏర్పాటు చేయిస్తాను. ఆస్తి మొత్తాన్ని మూడు భాగాలు చేసి చెరొకటి మీకిచ్చి, ఒక భాగం మా జీవనాధారం కోసం ఉంచుకుంటూ మా తదనంతరం దాన్ని కూడా మీ ఇద్దరికీ చెందేటట్లు రాయిస్తాను. ఇల్లు పెద్దది కాబట్టి మధ్యలో అడ్డుగోడ కడితే రెండు భాగాలు తయారవుతాయి. చెరొకదాంట్లో మీరుండవచ్చు. ఇహ మా సంగతి కదా! నింపాదిగా నేను ఏదో ఒకటి ఎక్కడో ఏర్పాటు చేసుకుంటాను.

అదేమిటి నాన్న! నేను ఇంకా బ్రతికే ఉన్నాను. ఆడాళ్ళ తగాదాలు చిలికి చిలికి గాలివానై ఇంతదాకా వచ్చినయి. సరే! మీ ఇష్ట ప్రకారమే కానివ్వండి. ఆస్తిని మూడు భాగాలు చేయనవసరం లేదు. రెండు భాగాలు మాత్రమే చేయండి. ఒకటి అన్నయ్యఇచ్చి, ఒకటి మీరు ఉంచుకోండి. మీ దగ్గరే కోడలూ నేనూ ఉంటాం' చెప్పాడు చిన్నకొడుకు.

'ఆస్తి పంపకం ఎలా జరిగినా పర్లేదు. అమ్మానాన్న మాత్రం నా దగ్గరే ఉంటారు. ఈ ఒక్క విషయమూ నా ఇష్టప్రకారమే జరగనివ్వరా తమ్ముడూ...' పెద్ద కొడుకు ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

'మీరిద్దరూ వేరువేరుగా ఉన్నప్పుడు ఏ ఒక్కరి దగ్గరో మేం ఉండటం అంత భావ్యంగా ఉండదు. నా నిర్ణయం ప్రకారమే విల్లు రాయిస్తాను. ఇహ మీరు వెళ్ళవచ్చు. మడత కుర్చీలోంచి లేచి నిల్చొని కండువాని సరి చేసుకున్నాడు పెద్దాయన.

'నాన్నా నాదో చిన్నమాట! చిన్నదో చితకదో నాకెలాగూ ఉద్యోగం ఉండనే ఉంది. అన్నయ్య చూస్తే సత్తెకాలపు మనిషి. అందులోను పిల్లలు పెద్దాళ్ళవుతున్నారు. పెళ్ళిళ్ళూ పురుళ్ళూ ఉంటాయి. అందుకని చెరువు కింద పదెకరాల పొలంలో నాకు వాటా అక్కర్లేదు నాన్నా. వీలునామాలో పొలం మొత్తం అన్నయ్యకి చెందేటట్లు రాయించు. ఈ విషయంలో నాకెలాంటి ఆక్షేపణా లేదు. నాన్నా మనస్ఫూర్తిగా చెబుతున్నాను. దయచేసి ఈ ఒక్కటే నేను చెప్పినట్లు చెయ్యినాన్నా!' అభ్యర్థించాడు చిన్న కొడుకు.

'వద్దు నాన్నా! వద్దు. వాడు చిన్నాడు. నాకు ఉన్నదాంట్లో వీలైతే వాడికి పెట్టాలి. అలాంటి వాడి దగ్గర తీసుకోవడమేమిటి? ఏదో నా మీద ప్రేమ కొలది అలా అంటున్నాడు. వాడి ఉద్యోగం మాత్రం ఏ పాటిదని? నాకు ఆస్తి తగ్గినా ఫర్లేదు నాకు వచ్చే భాగంలో వాడికి ఏది నచ్చితే అది నా కానుకగా ఇవ్వండి నాన్నా, పెద్దాడ్ని,

(మిగతా 15వ పేజీలో)

స్టార్ వార్స్

ముదిగంటి సుజాతారెడ్డి

"అబ్బ! యూరో 04 ఫుట్‌బాల్ ఆటలో ఇటలీ ఓడిపోయినప్పుడు ఫ్యాన్స్ అంటే అభిమానుల నుంచి చాలా కోపం అవమానాల పాలయ్యారు ఆంటీ!" అంది మాలిని లోపలికి వచ్చి కూర్చోక ముందే.

"పాపం! ఇటలీ ఆటగాళ్ళు ఇంటికి తిరిగిపోతుంటే చివరకు ఎయిర్‌పోర్టులో కూడా వాళ్ళను వెంబడించి తమ కోపం ప్రదర్శించారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్ల వర్షం కురిపించారు. టీవీలో చూపించారు. మీరు చూశారా ఆంటీ!" అని అడిగింది మాలిని.

"నేనది టీవీ చూడలేదు మాలినీ! కాని ఫుట్‌బాల్ ఆట జరిగిందంటే యూరోపులో భయంగానే వుంటుంది ప్రేక్షకులు ఫ్యాన్స్ ఏం బీభత్సం చేస్తారోనని. పాపం! ఏ దేశం టీమ్ అయినా ఓడిపోతే వాళ్ళకు ఫ్యాన్స్ నుంచి అవమానం తప్పదు. గెలుపు ఓటములు ఎప్పుడూ ఒకలాగా వుండవని ఆలోచించరు ఫ్యాన్స్. అందులో యూరోపులో ఫుట్‌బాల్ ఆటల పోటీలు జరిగాయంటే అవి ఫ్యాన్స్‌ల్లో, ప్రేక్షకుల్లో యుద్ధోత్సాహాన్ని కలిగిస్తాయి!" అన్నాన్నేను చిరునవ్వుతో.

"అవును ఆంటీ! ఆటల పోటీలు ఏదో రెండు దేశాల మధ్య యుద్ధం జరుగుతున్నట్లుగా చేస్తారు ప్రేక్షకులు" అంది మాలిని అద్భుతాన్ని ప్రదర్శిస్తూ.

"అవును పూర్వకాలంలో అయితే సరిహద్దు దేశాలతో యుద్ధాలు జరుగుతుండేవి. వీరులు సైనికులు తమ పరాక్రమాలను నిరూపించుకుంటూ యుద్ధాలు చేసేవాళ్ళు. అంతేగాక వీరుల మధ్యపోటీలుగా కత్తియుద్ధాలు, మల్ల యుద్ధాలు వుండేవి. ఇప్పుడా యుద్ధాలు, పోటీలు లేవు కదా. ఈ ఆటల పోటీలను యుద్ధాలుగా భావిస్తుంటారు జనం" చిరునవ్వుతో అన్నాన్నేను.

"అవును ఆంటీ! మన క్రికెట్ ఆటనే చూడండి. పాకిస్తాన్‌తో కాక మరే దేశంతో పోటీ జరిగినా అది ఆటల పోటీగా తీసుకుంటారు ప్రేక్షకులు. కాని అదే పాకిస్తాన్‌తో క్రికెట్ ఆట వున్నదంటే టెన్షన్. ఆ ఆటనొక యుద్ధంగా ఆ ఆటల పోటీలో గెలుపు ఓటములు యుద్ధంలోని గెలుపు ఓటములుగా తీసుకొని ఉత్సాహాన్ని నిరుత్సాహాలను ప్రదర్శిస్తుంటారు. మస్తు టెన్షన్‌లో పడ్తారు. కాని బలే మజాగా వుంటుంది పాకిస్తాన్ భారత్‌ల మధ్య క్రికెట్ ఆట ఆంటీ!" అంది మాలిని ఉత్సాహంగా.

"అదిగో చూసావా నువ్వే అట్లా అంటున్నావు. మరి అందరి మనసుల్లో అదే ఉత్సాహం కన్పిస్తూ వుంటుంది. కాని ఆటను ఆటగా "స్పోర్టివ్ స్పిరిట్"తో గాని, ఆటలో ప్రావీణ్యాన్ని చూడటంగ్గాని మానేసి కేవలం యుద్ధంగా భావించి గెలుపు ఓటములను సీరియస్‌గా తీసుకోవటం మాత్రం ఆటలను చెడగొట్టేస్తున్నాయి. ఇప్పుడు చూడు భారత్ పాకిస్తాన్ మధ్య క్రికెట్ ఆట అంటే అందరికీ – అటు క్రికెట్ బోర్డు వాళ్ళకు, రక్షక భటులకు ఆఖరికి

ప్రభుత్వాలకు పరీక్షగానే వుంటుంది" అన్నాన్నేను.

"అవును ఆంటీ! ఆ మధ్య భారత్ పాకిస్తాన్‌ల మధ్య పాకిస్తాన్‌లో జరిగిన క్రికెట్ ఆటలనే చూడండి ఎంత రభస జరిగింది. చివరకు పాకిస్తాన్ క్రికెట్ జట్టు కోచ్‌ను తీసేశారు. ఆటగాళ్ళ మీద విచారణలు జరిపారు. సరే! క్రమశిక్షణకు అదంతా అవసరమేమోగాని మరీ కక్షసాధింపుగా సాగితే మాత్రం బాధాకరంగానే వుంటుంది" అంది మాలిని.

"నిజమే కక్ష సాధింపుగా వుంటే ముందు ముందు వాళ్ళ మధ్య ఆటల పోటీలంటేనే బాధగా మారుతుంది మరి!" అన్నాన్నేను.

"కాని క్రికెట్ ఫ్యాన్స్‌కు మాత్రం నిరాశ కలిగిస్తుంది. అయినా ఈ ఫ్యాన్స్‌తో ఈ చిక్కులు వస్తున్నాయి. క్రికెట్ ఫ్యాన్స్ కన్నా సినిమాల ఫ్యాన్స్ ముఖ్యంగా సినిమా తారల ఫ్యాన్స్ పెద్ద తలనొప్పిగా మారారు. మా హీరో సినిమా విజయవంతంగా ప్రదర్శింపబడాలంటే మా హీరో సినిమా అని పోటీలు. ఇవీ యుద్ధాలుగా మారుతున్నాయి" అంది మాలిని ఒక ఫ్యాన్స్ నుంచి మరో ఫ్యాన్స్‌లోకి వెళ్ళిపోతూ.

"అవును వీటిని 'స్టార్‌వార్స్' అనవచ్చునేమో!" నవ్వాన్నేను.

"పాపం! హీరో బాగానే వుంటాడు. హీరో కోసం ఫ్యాన్స్ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అంతేకాదు సినిమా రిలీజ్ కాంగానే మొదటి ఆటచూడాలనే వీరోత్సాహంతో టికెట్ల కోసం తెగించి ప్రాణాలు కోల్పోతున్నారు. తమ హీరో సినిమా విజయోత్సవంలో పాల్గొనాలని బయలుదేరి గుంపులో నలిగిపోయి ప్రాణాలు బలి ఇస్తున్నారు. ఇక తమ హీరోకు ఏ ఆపద వచ్చినా వీళ్ళు తయార్! ఇదంతా విచిత్రంగా లేదా ఆంటీ!" అడిగింది మాలిని.

"పూర్వకాలంలో అయితే కావ్యాల్లోని పాత్రలను వీరులను, త్యాగధనులను, ఆదర్శంగా తీసుకునే వాళ్ళు. తర్వాత దేశ నాయకులను, స్వాతంత్ర్య సమర వీరులను వాళ్ళ చరిత్రలను, త్యాగాలను ఆదర్శంగా తీసుకునే వాళ్ళు. వాళ్ళలాగా కావాలని పనులు చేయాలని ఉత్సాహించే వాళ్ళు. ఇప్పుడవి ఏవీ లేవు కదా! దేశ నాయకులూ కరువయ్యారు. దాంతో జనాలకు సినిమా హీరోలే వీరులుగా ఆదర్శవంతులుగా కన్పిస్తున్నారు. వాళ్ళకే వీరపూజలు చేస్తున్నారు! ఏం చేస్తాం! ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క తీరు!" నా గొంతులో ఉత్సాహం స్థానంలో గాంభీర్యం చోటు చేసుకుంది. ✤



వస్తాద్ గర్వభంగం

నంద త్రినాథరావు

ఒకప్పుడు చైనాలో చింగ్ అనే గ్రామం వుండేది. అక్కడ చినాక్ అనే వస్తాద్ వుండేవాడు. అతను గొప్ప బలశాలి. ఎంతటి వస్తాదులైనా అతనిని కుస్తీ పోటీల్లో ఓడించలేకపోయేవారు. దాంతో చినాక్ బలగర్వంతో విర్రవీగేవాడు. అంతటితో ఆగక గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తూ, వారిని వేధించేవాడు. చినాక్ పీడ ఎలా వదిలించుకోవాలో వారికి అర్థమయ్యేది కాదు.

ఆ గ్రామంలో ప్రతి యేటా కుస్తీ పోటీలు జరుగుతుండేవి. చినాక్ ప్రత్యర్థులందర్నీ మట్టి కరిపించి, ప్రతిసారీ విజేతగా నిలిచేవాడు. తనను ఓడించే మగాడు ఆ గ్రామంలోనే లేడని మీసాలు మెలిపెట్టేవాడు. ఎవరైనా ఎప్పుడైనా కుస్తీ పోటీలో తనను ఓడిస్తే, ఆ గ్రామం విడిచిపోతానని సవాల్ విసిరేవాడు.

చినాక్‌ను ఓడించాలన్న పట్టుదలతో కుస్తీపోటీకి ఆ గ్రామనుండే కాకుండా, చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా వస్తాదులు వచ్చేవారు. కానీ అతని ధాటికి తట్టుకోలేకపోయేవారు. పైగా అతని చేతిలో తన్నులు తిని పలాయనం చిత్తగించేవారు.

అదే గ్రామంలో చినూక్ అని ఒక యువ వస్తాద్ వుండేవాడు. అతడు చాలా తెలివైనవాడు. చినాక్‌ని భుజబలంతో కాకుండా బుద్ధిబలంతో ఎదుర్కొని, అతనికి గట్టిగా బుద్ధి చెప్పాలని ఒక ఉపాయం ఆలోచించాడు.

చినూక్ ఆ మర్నాడే చినాక్‌తో పోటీకి తలపడ్డాడు. అతడు చినాక్‌తో, "నేను నీతో కుస్తీ పోటీకి వస్తాను. అయితే ఒక షరతు..." అన్నాడు. "ఏంటది?" నిర్లక్ష్యంగా అడిగాడు చినాక్. "ముందుగా నువ్వు మా పశువుల కొట్టంలోని ఒక పలుపు కర్రని పైకి లాగి పారేయాలి. దాన్ని పీకేసిన మరుక్షణం నేను నీతో పోటీకి సిద్ధపడతాను" అన్నాడు చినూక్ అతణ్ణి కవ్విస్తూ. అందుకు చినాక్, "ఓస్ అంతేనా? దాన్ని నా చిటికెన వేలితో లాగి పారేస్తాను. ఆ తర్వాత నీ పని పట్టేస్తాను" అన్నాడు కోపంగా.

చినాక్ ఆ వెంటనే చినూక్ ఇంటి ఆవరణలో వున్న పలుపు కర్రను పైకి లాగటానికి సిద్ధపడ్డాడు. ఆ పోటీ చూడ్డానికి గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. చినాక్ చాలా నిర్లక్ష్యంగా ఒక చేత్తో ఆ పలుపు కర్రని లాగడానికి ప్రయత్నించాడు. కానీ అది రాలేదు. అతడు వెంటనే మరో చేతిని కూడా ఉపయోగించాడు. అయినా ఆ కర్ర ఊడలేదు. దాంతో చినాక్ ఆశ్చర్యపోయాడు. తన భుజాల్లోని బలాన్నంతా ఉపయోగించి, ఆ పలుపు కర్రని పైకి లాగాలని చూశాడు. కానీ అంగుళం కూడా ఆ కర్ర కదల్లేదు. ఎంతసేపు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా దాన్ని ఏ మాత్రం కదల్చలేకపోయాడు చినాక్. చివరికి తన ఓటమిని అంగీకరించి, ఆ గ్రామం విడిచి వెళ్లిపోయాడు.

దాంతో ఆ గ్రామస్తులు ఆనందంతో చినూక్‌ని ఆకాశానికెత్తేశారు. అసలు విషయం ఏంటంటే... ఆ పలుపు కర్ర భూమిలో పాతింది కాదు. అది బాగా వేళ్లూని, సన్నగా ఏపుగా పెరిగి అక్కడే పాతుకుపోయిన వేప చెట్టు మాను. దాన్ని పలుపు కర్రంత ఎత్తుకి నరికి, దానికి తాడుతో పశువులను కట్టేవాడు చినూక్. ఈ రహస్యం అతనికి మాత్రమే తెలుసు.



చిన్నారి చిత్రకారులు



సిహెచ్. శ్వేత,
8వ తరగతి,
కీర్తి విద్యాలయం, మంగంపల్లి.



ఎల్.భావన, 5వ తరగతి,
సెయింట్ జోసఫ్స్
ఇంగ్లీష్ మీడియం స్కూల్.



శ్రీరామ్, 8వ తరగతి, ఆంధ్రా పబ్లిక్ స్కూల్, హరిపాలెం, విశాఖ.



లతీషా నన్నే, 10వ తరగతి,
ఎ.పి.లింగోటం, నార్కట్‌పల్లి, నల్గొండ.

సిహెచ్. బాలకృష్ణ,
8వ తరగతి,
భాస్కర్ హైస్కూల్,
బైపాస్ రోడ్,
పార్వతీపురం.



వి'చిత్రం'

చిన్నారులూ! ఇవాళ ఆదివారం కదా. కాస్త ఖాళీగా కూడా వుంటారు. అందుకని మీకోసం ఓ బొమ్మ తీసుకొచ్చాం. అదిగో పైన కనిపిస్తోందే అదే. అందులో రెండు చేతులున్నాయి. రెండూ పెన్ను పట్టుకుని వున్నాయి. చూశారుగా.

ఒక చెయ్యి మరో చెయ్యిని గీస్తున్నట్టు వుంది కదూ. మరైతే ఈ రెంటిల్లో ఏ చెయ్యి దేనిని గీస్తోందో కనుక్కోండి చూద్దాం. 'అబ్బో చాలా కష్టమైన ప్రశ్నే అడిగారే?' అనుకుంటున్నారు కొందరు నేస్తాలు. కొంతమందైతే చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారుకూడా. కానీ జవాబు చెప్పడానికి తికమక పడిపోతున్నారు. అసలు విషయం చెప్తే మరింత ఆశ్చర్యపోతారు. ఇవి రెండూ బొమ్మ చేతులే. అంటే ఆర్టిస్టు అంకుల్ వేసినవే. కాకపోతే ఒక చెయ్యి మరో చేతిని గీస్తున్నట్టు వెయ్యడం ఆయన ప్రత్యేకత.

చుక్కలు కలిపేస్తారా!



పొట్టలో పదాలు



ఇంగ్లీషు పజిల్-3

ఆ చేప భలే ముద్దుగా, బొద్దుగా వుందికదూ. ఎంచక్కా నీళ్లల్లో జాలీగా ఈదుతోంది. అన్నట్టు దాని పొట్టలో కొన్ని అక్షరాలు వున్నాయి. కాకపోతే అవన్నీ తికమకగా వున్నాయి. వాటిని ఓ వరుసలో పెడితే అర్థవంతమైన పదాలు వస్తాయి. అవన్నీ నీళ్ల, అందులో తిరగే చేపలకు సంబంధించినవే. మరి ఆ పదాలేంటో రాసి మాకు పంపితే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మా చిరునామా: **ఇంగ్లీషు పజిల్, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**



పజిల్-2 సమాధానం

WOCKOEREDP	WOODPECKER
TUULERV	VULTURE
CAONUT	TOUCAN
SWLALWO	SWALLOW
CAEPOKC	PEACOCK
WORC	CROW

పజిల్-1కు సమాధానాలు రాసినవారు

యు.మౌనిక, 8వ తరగతి, దమ్మపేట హైస్కూల్, దమ్మపేట, ఖమ్మం.
కె.శ్రీఅనూహ్య, 6వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు.
టి.వెంకటరామచౌదరి, 9వ తరగతి, చీరాల.

July విలువ ఎంతంటే...

j (10), u (21), l (12), y (25) విలువలు కలిపితే 68 వస్తుంది. ఇలా పూలు, కాయలు, పళ్లు, జంతువుల విలువలు కూడా కనుక్కోవచ్చు. తమాషాగా వుంటుంది. కాలక్షేపం అవుతుంది.

తెలివైన తమాషా

ఏనుగులు-కుందేలు

ఒక అడవిలో కొన్ని ఏనుగులు, కుందేళ్లు వున్నాయి. ఎండాకాలంలో వాటికి నీళ్లు కరువయ్యాయి. ఏనుగులు వెళ్లి గజరాజుతో తమకు వచ్చిన కష్టం గురించి చెప్పుకున్నాయి. అప్పుడు గజరాజు సేవకులను పిలిచి, "ఎక్కడైనా నిండుగా నీరున్న సరస్సు వుందేమో చూసి రండి" అని ఆజ్ఞాపించాడు. సేవకులు అడవి అంతా గాలించి, కొంతదూరంలో ఒక చెరువు వుందని చెప్పారు. వెంటనే గజరాజు తమ పరివారంతో ఆ చెరువు దగ్గరకు వెళ్లాడు. అందరూ స్నానాలు చేసి దాహం తీర్చుకున్నారు. ప్రతిరోజూ ఏనుగులన్నీ ఆ చెరువు దగ్గరకు రావడం మొదలుపెట్టాయి.

ఆ చెరువు సమీపానున్న పొదల్లో కుందేళ్లు నివసిస్తున్నాయి. ఏనుగుల మంద చెరువు దగ్గరకు వచ్చినప్పుడల్లా కొన్ని కుందేళ్లు వాటి కాళ్ల కింద పడి మరణిస్తున్నాయి. పర్వతాల్లా వున్న ఏనుగుల్ని ఏమీ చేయలేక కుందేళ్లన్నీ తమ రాజుకు మొరపెట్టుకున్నాయి. కుందేళ్ల రాజు శిలీముఖుడు జరిగిన నష్టానికి చింతించాడు. వెంటనే తన మంత్రులను పిలిచి, "ఏనుగుల బాధ తప్పే ఉపాయం ఆలోచించండి" అన్నాడు. ఏ ఉపాయం తోచక మంత్రులందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. అప్పుడొక ముసలి కుందేలు ముందుకు వచ్చి "ప్రభూ! బాధపడకండి! బుద్ధిబలంతో ఏనుగులు చెరువు దగ్గరకు రాకుండా



చేస్తాను" అంది. అందుకు రాజు దాన్ని ఎంతగానో మెచ్చుకున్నాడు.

ముసలి కుందేలు చెరువు దగ్గరున్న కొండపైకి ఎక్కింది. ఏనుగులు రావడం చూసి, "గజరాజా! ఆగు. ఆ చెరువులో దిగకు" అంటూ అరిచింది. "ఓరీ! నన్నాపడానికి నువ్వెవరు? చెరువులో దిగొద్దని ఆజ్ఞాపించే అధికారం నీకెవరిచ్చారు?" అంటూ గజరాజు గద్దించాడు. "నేను చంద్రదేవుడి ఆజ్ఞ ప్రకారం నీకొక విషయం చెప్పదలిచాను" అంది ముసలి కుందేలు. దానికి గజరాజు అసహనంగా "ఏంటో చెప్పు!" అన్నాడు.

"గజరాజా! తనపై కత్తులు దూసినా దూత అబద్ధం చెప్పడు. ఎట్టి సందర్భంలోనూ దూతను చంపరాదు. చంద్రుడు చెప్పమన్న మాటలు చెప్తున్నాను. విను. 'ఈ సరస్సు నాది. కనుకనే దీనికి చంద్ర సరోవరం అనే పేరు వచ్చింది. దీనికి కాపలా వున్న కుందేళ్లను నీ గుంపు తొక్కి చంపుతోంది. దానికి ప్రతీకారంగా నీ జాతిని చంపటం నాకేమీ కష్టం కాదు. ఇకముందు ఈ చెరువు జోలికి వచ్చినా, నా సేవకులైన కుందేళ్లకు హాని చేసినా సహించను. జీవితం మీద ఆశ వుంటే ఈ చెరువు దగ్గరకు మళ్లీ రాకు' అని చంద్రుడు చెప్పమన్నాడు" అంది ముసలి కుందేలు. ఆ మాటలు విని ఏనుగులు అదిరిపడ్డాయి.

"ఓ కుందేలా! ఇది తెలియక చేసిన తప్పు. చంద్రదేవుడు ఆజ్ఞాపించినట్లే ఇక ముందెన్నడూ ఇటు రాము. ఈ సంగతి ఆయనకు చెప్పి మమ్మల్ని క్షమించమను" అని గజరాజు వేడుకున్నాడు. "చంద్రుడు దయామయుడు. మీ తప్పులను క్షమిస్తాడు. కాసేపటిలో ఆయన ఇక్కడకు వస్తారు. ఆయనను దర్శించి క్షమించమని వేడుకో!" అంది కుందేలు.

గజరాజు, అతని అనుచరులు చెరువు గట్టున చంద్రుని కోసం ఎదురుచూస్తుండగా రాత్రయ్యింది. ఆకాశం లోని చంద్రుని ప్రతిబింబం నిర్మలమైన చెరువు నీటిలో స్పష్టంగా కనిపించింది. దాన్ని కుందేలు గజరాజుకి చూపి, "గజరాజా! చంద్రదేవుడిప్పుడు కోపంగా వున్నాడు. ఆయన ఇప్పుడు మాట్లాడరు. కనుక క్షమించమని నమస్కరించి వెనుదిరిగి వెళ్లిపో..." అంది కుందేలు. గజరాజు అలాగే చేసి వెళ్లిపోయాడు. తిరిగి ఏనుగులు ఎన్నడూ ఆ చెరువు వైపు రాలేదు. ముసలి కుందేలును మిగతా కుందేళ్లన్నీ ఎంతగానో మెచ్చుకున్నాయి.

"వందేమాతరం" ఆల్బమ్

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

తూర్పు తెలవారలేదు.

భరత్‌బాల బద్ధకంగా మంచం మీద కదిలాడు.

ఉదయం ఆరుగంటలకు రేడియోలో వచ్చే వందేమాతరం వింటూ తన్మయత్వం చెందడం. ఆ తర్వాత నిద్రలేవడం అలవాటు. ఆ ప్రకారం మంచం పక్కనున్న టేబుల్‌పై రేడియో ఆన్‌చేశాడు.

రెండు నిమిషాలు వాద్య సంగీతం. తర్వాత మృదుమధురంగా వందేమాతరం మొదలైంది. ఆ గీతం గొప్ప ఉద్వేగాన్ని కలిగిస్తోంది.

గీతాలాపన పూర్తయ్యే వరకూ భరత్‌బాల కళ్ళు తెరవలేదు.

తర్వాత లేచి మంచం దిగాడు.

"మీ కోసం యాడ్ ఎగ్జిక్యూటివ్ వచ్చారు. ముందుగదిలో ఆఫీసు రూంలో కూర్చున్నారు!" భార్య కనక చెప్పింది.

ఎంత తొందరగా లేచాడో అంత తొందరగా అన్ని పనులు పూర్తి చేసుకుని గబగబా ముందు గదిలోకి వచ్చాడు.

అప్పటికే నలుగురు వ్యక్తులు ఎదురు చూస్తున్నారు.

భరత్‌బాల అసిస్టెంట్లు కూడా అక్కడే వున్నారు.

"మోటారు సైకిళ్ళకు సంబంధించి రెండు నిమిషాల కమర్షియల్ యాడ్‌ను రూపొందించాలి. బడ్జెట్ ఎంతైనా ఫర్వాలేదు. మీమీద నమ్మకంతో వచ్చాము!" అన్నారు ఆ వ్యక్తులు.

తమ కంపెనీకి సంబంధించి వివరాలు, బ్రోచర్లు మోటారు సైకిల్ మోడళ్ళు చూపించారు. తర్వాత "సినీ యాక్టర్లతో యాడ్‌ను తయారు చేయాలని ఉంది!" అన్నారు.

భరత్‌బాల అన్నీ పరిశీలించాడు.

"అంటే?"

"మీరు అనుకున్న స్థాయిలో కార్యక్రమం రావాలంటే కనీసం ఆరునెలలు ఆగాలి... ఈ లోపు నేనో బృహత్తరమైన ప్రాజెక్టు చేపట్టాను. అది కూడా పూర్తవుతుంది. దానికోసం ఇప్పటికే చాలా వర్కు చేశాను. దేశంలో వివిధ ప్రాంతాలకు వెళ్ళాలి..." భరత్‌బాల వివరించాడు.

"అలస్యమైనా ఆగుతాం... ఎప్పుడికైనా మీరే మా యాడ్‌ను రూపొందించాలి... ఇంతకూ మీరు చేపట్టబోయే ప్రాజెక్టు ఏమిటి?

"వందేమాతరం"

* * *

భరత్‌బాలకు చిన్నతనం నుంచి ఫొటోగ్రఫీ అంటే ఇష్టం.

నచ్చిన ఫొటోలు తీయడం వాటన్నింటినీ ఆల్బంలుగా రూపొందించి దాచుకోవడం అలవాటు. మామయ్య కొనిచ్చిన వీడియో కెమెరా చేతికిరావడంతో అతని ఉత్సాహానికి అంతే లేకుండా అయిపోయింది.

చదువు పట్ల శ్రద్ధ వున్నప్పటికీ వీడియోగ్రఫీ పట్ల ఉన్న ఆసక్తి దానిని డామినేట్ చేసింది. రకరకాల దృశ్యాలను చిత్రీకరించడం.... చిన్న చిన్న నాటకాలను తన కెమెరాలో బంధించడం చేసేవాడు.

చివరికి అదే వృత్తిగా మారిపోయింది.

1996 వరకూ యాడ్ ఫిల్ముల రూపకర్తగా మారాడు.

చిన్న చిన్న కంపెనీలను సంప్రదించి వారి వ్యాపార అభివృద్ధికి రెండు మూడు నిమిషాల నిడివి షార్ట్‌ఫిల్మ్‌లు తీసేవాడు. ఇందుకోసం తనకు నమ్మకమైన ఇద్దరు ముగ్గురు సిబ్బందితో కార్యాలయాన్ని కూడా ప్రారంభించాడు.

వివిధ సంస్థలు పరిశ్రమలు, ప్రాజెక్టులకు సంబంధించి 150 యాడ్ ఫిల్ములను రూపొందించాడు. కానీ ఎటువంటి గుర్తింపు రాలేదు.

ఆ సమయంలో ఎం.ఆర్.ఎఫ్. టైర్ల కంపెనీ నుంచి అతనికి మంచి ఆఫర్ వచ్చింది. టైర్ల అమ్మకాలు పెంచడానికి యాడ్ రూపొందించమని సంస్థ యాజమాన్యం భరత్‌బాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది.

ఎంతో కష్టపడి యాడ్ ఫిల్ము తయారు చేశాడు.

ఈ టైరు ఎన్నటికీ అలసిపోదు అనే అర్థం వచ్చేటట్లు 'ది టైర్ దట్ నెవ్వర్ టైర్స్' అనే కాప్షన్‌తో తయారైన ఆ యాడ్ తీవ్ర సంచలనం కలిగించింది. ఆ కంపెనీకి అమ్మకాలు పెరిగిపోయి కాసుల వర్షం కురిసింది.

1997లో వచ్చిన ఈ విజయంతో భరత్‌బాల మరి వెనక్కి తిరిగి చూడలేదు. ఎన్నో పెద్ద పెద్ద కంపెనీలు అతని యాడ్ ఏజెన్సీ ముందు క్యూ కట్టాయి. అతని భార్య కనక సహకారం కూడా అతనికి తోడైంది. యాడ్ ఫిల్ముల రూపకల్పనలో కూడా ఆమె అండగా నిలిచింది. ఫలితంగా పెద్దకార్యాలయం... సిబ్బంది... ఇతర నెట్‌వర్క్... రకరకాల సహాయకులతో భరత్‌బాల స్థాయి పెరిగిపోయింది. ఆదాయం రెట్టింపు అయ్యింది.

ఆ సమయంలో జరిగిన సంఘటన భరత్‌బాలపై ఎంతో ప్రభావాన్ని చూపించింది. అతని తండ్రి రాయ్ స్వాతంత్ర సమరయోధుడు. దేశం కోసం



పోరాటం చేశాడు. అందుకే తన కొడుక్కి కూడా భరత్ అని పేరు పెట్టుకున్నాడు.

ఆ రోజు కొడుకును పిలిచి – "నీ కృషితో జీవితంలో బాగా స్థిరపడ్డావు. నీ యాడ్ కంపెనీ అద్భుతంగా ఉంది. నీకు లభించిన ఈ విజయం ఎంతోకాలం నీకు సంతృప్తిని ఇవ్వగలదు. ఈ దేశం నీకు ఎంతో చేసింది. ఈ దేశం కోసం నీవు ఏం చేస్తావు?" ప్రశ్నించాడు.

తండ్రి అడిగిన దానికి భరత్‌బాల వద్ద సమాధానం దొరకలేదు. "ఏం చేయాలి నాన్నా?" ప్రశ్నించాడు.

"దేశ ప్రజలందర్నీ కదిలించేలా దేశభక్తిని ప్రబోధించేలా... ఏమైనా చేయకూడదూ?"

తండ్రి అభ్యర్థన భరత్‌బాల మనసులో తీవ్రమైన ముద్ర వేసింది. ఎలాగైనా సాధించాలి.. ప్రతి భారతీయుడ్ని కదిలించేలా ఒక ఫిల్ము రూపొందించాలి... ప్రతి వ్యక్తి అందులో తనను తాను చూసుకోవాలి అనిపించేలా తయారు చేయాలి అనుకున్నాడు.

ఆ ఆలోచనల రూపకల్పనే
వందేమాతరం ఆల్బం.

* * *

భరత్‌బాల. ప్రసిద్ధ సంగీత దర్శకుడు రెహమాన్ ఒకే కాలేజీలో సహాధ్యాయులు. మంచి స్నేహితులు. అంతకుముందు భరత్‌బాల రూపొందించిన కొన్ని యాడ్ ఫిల్ములకు రెహమాన్ సంగీతాన్ని సమకూర్చాడు.

వందేమాతరం పేరుతో రాసిన గీతానికి ట్యూన్ కట్టమని రెహమాన్ వద్దకు వెళ్ళాడు. అప్పటికే వందేమాతరం గీతం ఒక బాణీలో ఉంది. దానికి భిన్నంగా ఆకర్షణీయంగా రూపొందించాలని కొత్తగా రూపకల్పన చేసి స్వరకల్పన గావించాడు. ప్రతి ఒక్కరినీ హత్తుకునే విధంగా ట్యూన్ తయారైంది. వందేమాతరం కొత్తగీతం రెహమాన్ గొంతు నుంచి జాలువారగా అద్భుతమైన సంగీతంతో రికార్డు అయిపోయింది.

రికార్డు అయిన దేశభక్తి గీతాన్ని దృశ్యరూపంలో మలచాలి. భరత్‌బాల ఆలోచనలన్నీ రంగరించి ఒక కార్యాచరణ తయారు చేశాడు. ఈ గీతం ఎవరు చూసినా భారతదేశం అంతా ప్రతిబింబించాలని భావించాడు. ఆసేతు హిమాచలాన్ని తన కెమెరాలో బంధించి భారతీయులకు సాక్షాత్కరించాలని నిర్ణయించాడు. రెహమాన్ పాట మాతృదేశపు గుండె చప్పుడు వినిపిస్తే భరత్‌బాల చూపించిన విజువల్స్ భారతదేశ ఆత్మసౌందర్యాన్ని కళ్ళముందు సాక్షాత్కరింప చేస్తుంది

ఇందుకోసం భరత్‌బాల భారతదేశంలో నాలుగువైపులా పర్యటించారు. మూడున్నర సంవత్సరాల్లో 60 వేల కిలోమీటర్ల ప్రయాణంలో ఎన్నెన్నో దృశ్యాలను తన కెమెరాలో బంధించారు. సముద్రమట్టానికి 17,000 అడుగుల ఎత్తున ఉన్న లడక్ బతుకు చిత్రం, గుజరాత్ ఎడారిలో ఓ తల్లి ఆమె ఇద్దరు బిడ్డలు... భారంగా నడిచే ఒంటె ప్రయాణం. ఆ తర్వాత తెలుగు గ్రామీణ మహిళ... ఇసుక తుపానులో ముడతలు బడ్డ శరీరంతో ఒక వృద్ధుడు... కేరళలో పచ్చదనం... లంబాడీ స్త్రీలు కుండలతో నీళ్ళు మోయడం, గుంపులు గుంపులుగా పరుగులు తీయడం... చిన్న పిల్లలు భారత జాతీయ పతాకాన్ని చూపిస్తూ కొండలు కోనలు దాటడం పెద్ద పతాకాన్ని పట్టుకున్న గుంపును విమానం నుంచి చిత్రీకరించడం అద్భుతంగా వచ్చింది. భరత్ రూపొందించిన ఆ చిత్రాలు చూస్తుంటే కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, బెంగాల్ రాజస్థాన్ ఇలా విడిగా ఏదీ కనిపించదు. అంతా ఒకే ఫ్రేములా, ఒకే సమాజంగా సంపూర్ణ చిత్రం చూస్తున్న అనుభూతి కలుగుతుంది.

ఈ ఆల్బం చిత్రీకరణ కోసం 65 మంది సుప్రసిద్ధ సంగీత విధ్వాంసుల్ని లడక్‌లో ఒకే దగ్గరికి చేర్చాడు. హరిప్రసాద్ చౌరాసియా, బాలమురళీకృష్ణ, భీమ్‌సేన్ జోషీ, శివకుమార్ వర్మ, జస్‌రాజ్ ఇలా ఎందరో వీరిలో ఉన్నారు. వీరందరూ వివిధ భాషల్లో కొన్ని చరణాలు అందించారు. ఇండియాగేట్ వద్ద 'ఏ మేరే వతన్' అంటు గాన కోకిల లతా మంగేష్కర్ ఆలపించిన గీతం చరణానికి కన్నీళ్ళు చిలికిస్తాయి. తన చిరకాల సాకారమైన వందేమాతరం తయారైంది.

* * *

1999 ఆగస్టు 15.

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 50 సంవత్సరాలు పూర్తయినందున స్వర్ణోత్సవ సంబరాలు జరుపుతున్నారు.

రాత్రి 8 గంటల నుంచి 8.10 వరకూ వందేమాతర గీతం మొదటిసారి ప్రసారం అయ్యింది. దేశంలో అన్ని టీవీ ఛానెళ్ళు... రేడియోలలో ఈ గీతం ప్రసారం అయ్యింది.

వింటున్న వారు.. వింటూ చూస్తున్నవారు తన్మయులైపోయారు. భారతదేశమంతా తమ ముందు సాక్షాత్కరించిన అనుభూతికి లోనయ్యారు. 'ఓ మా తుఝె సలామ్' వందేమాతరం అంటు ఉద్వేగభరితంగా వినిపిస్తున్న ఈ గీతం వింటుంటే శరీరం పులకించిపోయింది.

ఆ తర్వాత ఈ ఆల్బం 400 థియేటర్లలో రిలీజై ఎంతోమంది దేశభక్తుల గుండెల్లో ఆర్ధ్రతను నింపింది. కానీ ఆనాడు అధికారంలో వున్న సంఘ పరివారీయులకు ఒక విషయంలో గొంతులో పచ్చివెలక్కాయ ఇరుక్కున్నట్లయ్యింది. తమదేనని హైజాక్ చేయబోయిన వందేమాతరగీతం ముస్లిం అయిన ఎ.ఆర్.రెహమాన్ సంగీతం కూర్చడం, పాడటం మింగుడు పడలేదు. గానీ అప్పటికే యువ హృదయాల్లోకి వెళ్ళిపోయింది.

భరత్‌బాల కృషి నెరవేరింది.

ఆల్బం మొత్తం సి.డి.లో భద్రపరిచాడు. సి.డి. ప్లేయర్ ఎప్పుడూ ప్రసారానికి సిద్ధంగా ఉంటుంది. ఆ టీవీ భరత్‌బాల పడుకునే మంచం ఎదురుగా ఉంటుంది.

ప్రతిరోజూ రాత్రి పడుకొనే ముందు సి.డి. ఆన్ చేయడానికి సిద్ధం చేస్తుంది భార్య కనక.

ఉదయాన్నే లేవగానే స్వాతంత్ర సమరయోధుడైన తన తండ్రి ఫోటోను చూస్తాడు. తర్వాత వందేమాతరం సి.డి. ఆన్ చేస్తాడు.

మా తుఝే సలాం వందేమాతరం అంటూ గీతాలాపనతో తాను చిత్రీకరించిన భారతదేశాన్ని తన్మయత్వంతో చూస్తాడు. అలా చూస్తున్నప్పుడు తరచుగా అతని కళ్ళు చెమరుస్తుంటాయి. తడి అవుతుంటాయి. ఏ రోజు చూసినా అందులో కొత్తదనమే కనిపిస్తుంది. దేశం కోసం ముందుకు కదలాలన్న స్ఫూర్తే కలుగుతుంది.

ఆ తర్వాతే తన దైనందిన కార్యక్రమాలు మొదలుపెడతాడు.

'మహాలయ అమావాస్య'

(9వ పేజీ తరువాయి)

తమ్ముడికి ఆ పాటి కూడా ఇవ్వలేనా ఏమిటి?' పెద్దకొడుకు ప్రాధేయపూర్వకంగా తండ్రిని అడిగాడు.

పెద్దాయన హృదయంలో ఆనందం పొంగిపొర్లింది.

తన పిల్లల్లో ఆప్యాయతలూ అభిమానాలు చెక్కుచెదరలేదు. ఆ రక్త సంబంధానికింకా అడ్డుగోడలు ఏర్పడలేదు.

'భగవంతుడా! వీళ్ళిద్దరి బంధం కడదాకా ఇలాగ కొనసాగనీ..' కళ్ళు మూసుకుని క్షణకాలం ప్రార్థించాడాయన.

* * *

అప్పటికీ ఇప్పటికీ దిగజారుతున్న మానవ సంబంధాల్ని చూస్తూనే ఉన్నారు కదా! ఆ కాలంలో కుటుంబ పెద్దలకి జీవితం పట్ల నిర్దుష్టమైన అభిప్రాయాలుండేవి. కాబట్టి అనుబంధాలు కూడా అంతలోతుగా పాతుకుని ఉండేవి.

కాలం మారుతోంది. ఇచ్చే సౌకర్యాలూ హోదాలు ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ఆధునిక ముసుగులో సమస్తమూ మునిగి తేలుతూంది. శాటిలైట్ యుగంలో కాస్మోటిక్ సంస్కృతి రాజ్యమేలుతుంది. ఈ ఆధునికతకు ప్రేమా అనురాగాలు అక్కర్లేదు. ధనం కావాలి. ధనం ఇచ్చే సుఖాలు కావాలి. కుటుంబం ఎంత చిన్నదిగా ఉంటే అంత మంచిది. 'నేనూ భార్యాపిల్లలూ' ఇంతే! అంతకన్నా ఇంకెవరూ అక్కర్లేదు.

ఎందరు మనుమలు తమ తాతయ్యలకి ఆప్యాయతల్ని పంచగలుగుతున్నారు ? ఎందరు మనుషులు తమ బంధువుల్ని స్వచ్ఛమైన ఆప్యాయతలతో ఆహ్వానిస్తూ ఆదరించగలుగుతున్నారు. ఎందరు తమ పెదాలపై స్వచ్ఛమైన చిరునవ్వుని నిలుపగలుగుతున్నారు.

అంతా కృత్రిమత్వం... కపట నాటకం..

బాహ్య సంపదలు తప్ప అంతఃసంపదలు లేని జీవచ్ఛవాలు. ఈ శాటిలైట్ టౌన్‌షిప్ యుగంలో సంచరిస్తున్న నిర్జన శరీరాలు...

తిలక్ అన్నట్లు మనవి మనం పోగొట్టుకున్న దినం మహాలయ అమావాస్య.

మనని మనం పోగొట్టుకుంటూ ఏ వెలుగులు కోసం ఈ పయనం ?

ఇది కష్టకాలం

లక్ష్మి

భయం పట్టుకుంటే –
ఇంకంతే సంగతులు!
భయమనే రోగానికి మందుండదు. అది మనస్సుని గట్టిగా పట్టుకుంటుంది. మానసికంగా మనిషిని కృంగదీస్తుంది!

తాడుని చూచి పామనుకుంటారు!

అమ్మో పామని గంతులేస్తారు!

భయం పట్టుకున్న మనిషి సుఖంగా బతకలేడు. తన నీడనే చూచి దెయ్యమనుకుంటారు. అమ్మో దెయ్యమని బెదిరిపోతారు!

చాలా అనవసరంగా –

అనేకానేకం ఊహించుకుంటారు!

ఆ దిక్కుమాలిన ఊహల్తో గజగజా వణికిపోతుంటారు. అనుక్షణం అశాంతితో అల్లాడిపోతుంటారు!

తత్తరపాటు అధికమవుతుంది!

కలవరపాటు ఖంగారు పెడుతుంది!

గుండెల్లో రైళ్ళు పరుగెడుతుంటాయి. ఆందోళనతో అతలాకుతలమవుతుంటారు. కడుపునిండా తినలేరు. కంటినిండా నిద్రపోలేరు!

భయం బతుకు బతికేకంటె –

బాల్చీ తన్నేయడమే బెటరుగా కనిపిస్తుంది!

అనేకానేకమైన కారణాలతో మనిషికి భయం కలుగుతుంది. మొన్నా మధ్య మా యింటికి మావారి దూరబ్బంధువొకాయన వచ్చేడు!

ఆయన ప్రభుత్వోద్యోగి!

రెండేళ్ళలో రిటైరు కాబోతున్నారు. తీర్థయాత్రలు చేసి తరించాలనే పవిత్రమైన కోరికతో రెండు నెలలు సెలవు పెట్టేరుట!

మొదట ఉత్తరాంధ్రలో ముఖ్యమైన పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. ఆ తర్వాత భద్రాచలంలో శ్రీరామచంద్రమూర్తిని చూసుకుని యాదగిరి గుట్టకు వెళ్ళి ఇప్పుడు తిరుపతి ప్రయాణం పెట్టుకున్నారు!

మధ్యలో మమ్మల్ని పలకరించడానికి మా ఇంటికి వచ్చేరు!

"పిన్నిని కూడా తీసుకురావలసింది బాబాయ్!" అన్నారు మావారు.

"ఎందుకూ?"

"అదేమ్మాట? పుణ్యమంతా నీ ఒక్కడికే దక్కాలనుకుంటున్నావా?"

"అంటే? నేను పుణ్యం కోసం దేశదిమ్మరినయ్యేననుకుంటున్నావా?"

"మరి?"

"మనశ్శాంతి కరువైనప్పుడు కూడా మనిషి దేశదిమ్మరే అవుతాడు. ఇలాంటప్పుడు ఇల్లాలు పక్కనుంటే నరకాన్ని వెంటబెట్టుకు వెళ్ళినట్టే వుంటుంది. మగాడి గుట్టు ఆడవాళ్ళకి తెలీకూడదురా! వాళ్ళ నోరు మంచిది కాదు!"

"అసలింతకీ నీకు కష్టకాలం–"

"ఎందుకడుగుతావులే! ఆఫీసుకి వెళ్ళాలంటే భయంగా వుందిరా చిట్టీ! సెలవు పెట్టి ఇంట్లో కూచుందామా అంటె పిల్లలు ఊరుకోరు. అస్తమానం టీవీ ఆన్‌చేసి భయపెడుతుంటారు!"

"టీవీ ప్రోగ్రాములు చిరాగ్గా వుంటే వుండొచ్చుగానీ – భయమెందుక్కలిగిస్తాయి?"

"అవినీతి భాగోతమంటూ రోజుకో కథ ప్రసారం చేస్తున్నారు గదరా! ఎవడో ఏదో పనిమీద మన ఆఫీసుకొస్తాడు. నా పని చేసి పెట్టండి... మీ రుణం వుంచుకోనని డైలాగు చదువుతాడు. అంత డైలాగు విన్న తర్వాత మనకి ఉత్సాహం కలుగుతుంది. అయిదువేలో పదివేలో అడుగుతాం. ఓసింతేనా అని మనం అడిగినంతా యిస్తాడు. మనకి తెలీకుండా రహస్యంగా ఈ భాగోతం మొత్తం వీడియోలోకి ఎక్కుతుంది. ఆ తర్వాత ఇదిగిదిగో ఇదొక అవినీతి భాగోతమని బుల్లితెరమీద ప్రసారం చేస్తారు. ఆ మరుసటి రోజు ఆఫీసులో మన చేతిలో కాగితమ్ముక్క పెడతారు. అందులో – ఇంటికెళ్ళి రెస్టు తీసుకోమని వుంటుంది. అంటే ఏమిట్రా? బంగారం లాంటి బతుకు టీవీ పుణ్యమాని బజారుకెక్కుతోందనేగా అర్థం?"

"మంచిదేగా! అవినీతిపరుల్ని శిక్షించడం తప్పుకాదు గదా!"

"అదేం మాట? ఇన్నేళ్ళుగా అలవాటు పడిన ప్రాణం! ఇవాళ ఇంత అర్జంట్‌గా మడికట్టుకోమని చెబితే కుదుర్తుందా? ఆఫీసుకెడితే ఏ క్షణంలో ఏం కొంపమునుగుతుందోనన్న భయంతో తీర్థయాత్రల వంకతో పారిపోతున్నార్రా ఉద్యోగస్థులు! వాళ్ళల్లో నేనూ ఒకణ్ణి! ఇల్లాంటి పరిస్థితిలో మీ పిన్నిని కూడా వెంటబెట్టుకుని ఊరేగడం మంచిదా? ఉరిపోసుకున్నట్టు కాదూ?"

ఇదీ ఆయన భయం!

ఈ భయం ఎప్పుడు తొలిగేనూ? అన్నవరం వెళ్ళివస్తే సరిపోతుందా? తిరుమలకొండ ఎక్కితే పరిష్కరింపబడుతుందా?

అదట్లా వుంచండి –

తగుదునమ్మాంటు వేలకు వేలు లంచాలు మింగుతూ – ఆడవాళ్ళకి తెలుస్తే అల్లరవుతామనే భయంతో గుట్టుగా కాలక్షేపం చేస్తున్నారే తప్ప – మనం చేస్తున్నది నేరమనే ఆలోచన వాళ్ళకి రావడం లేదు!

ఇప్పుడు ప్రైవేటు ఛానల్స్ ఆడవాళ్ళకి ప్రతీకలుగా నిలిచేయి!

జరుగుతున్న అరాచకాన్ని అల్లరి చేయడమే తమ ధ్యేయంగా పెట్టుకున్నాయి! ◆

రుక్మిణి

బంగారు గుడ్డు

జక్కులోడు అన్నం తిని బేవురుమన్నాడు. ఒళ్ళంత యాష్టగా వుండి మంచం మీద కూలబడి నిద్దట్లోకి జారుకుందామని ఆలోచన్లు చేస్తండు. బయట మొయిలు బట్టి ఇంగ ఇపుడో మరో సిటెంలనో వానొచ్చెటట్లుండె – గపుడు వాని పెండ్లం లోపల బాసన్లు బోళ్ళు బందోబస్తు చేసి పైటకు చెయ్యి తుడుసుకుంట వచ్చి పీటేసుకుని కూలబడ్డది.

"ఏందయ్యా – పన్జేసి చేసి సెయ్యంత గుంజుతుంది. నువ్వింగ తిని పండుకొనుడేనా... ఏమైనా ముచ్చట్లు గిన చెప్పేది లేదా?" అని రుసరుసలాడింది. "ముచ్చట్లా" అని నోరెళ్ళ బెట్టిండు–

"గదే... పని పాటల్లేని నీ సావాసగాళ్ళతోని పడిపడి తిరుగుతవ్‌గద! ఊరు వాడంతా నీదేనాయె! చెప్పకపోతే మాయె... ఆనొచ్చెటట్లుంది..

"అదికాదె.. ముచ్చట్లంటె నీకర్థం కావు. సరెగాని ఒక కథ చెప్త.. వింటవా?" జక్కులోడి మాటలకు ఆవిడలో వుషారెక్కింది. పీటమీద గోడకానుకుని నిగడదీసి కూకుంది. జక్కులోడు కథ మొదలు పెట్టిండు. బయట ఉరుములురుముతున్నె – మధ్యాన్నమైనా నల్లబడి సల్లంగుంది.

"అనగనగనగనగా...!" జక్కులోడి పెండ్లాం దిగ్గున లేవబోయింది.

"అర్రె.. కూకో... కథ మొదలయితందిగదా! సరె... ఆ రాజుగారికి రోజూ గెడ్డం గీకడానికో ఆఫీసు మంగలి కూడా వున్నాడన్నమాట. వాడు టంచనుగా పొద్దున్నె రాజమహల్‌కు వచ్చి తన పని తాను కానిచ్చుకునేవాడు. పదిచోట్ల తిరుగుతడు. పదిమందిలో వాగుతడు. వాళ్ళు వాగింది వింటడు... వీడికి ప్రతి సందుగొందుల్లోని జనాలతోని లింకులుంటాయి. దోస్తానా వుంటుంది. కాబట్టి వీడ్నిగిన అడుగుతే రాజ్యంలోని సంగతులు బహుపసందుగా తీరుగా చెప్తడుగద!"

వాడి భార్య 'ఊ' కొడుతూ జాగర్తగా వింటుంది. అపుడే ఉస్కురోమని చినుకుల్లబడి వచ్చిన యాద్గిరి బయట వరండా అరుగు మీద కూలబడ్డాడు. జక్కులోడు వాడ్ని కనిపెట్టలేకపాయె.

"నువు చెప్పు... కానియ్" వాడి భార్య ఎగదోస్తూ అనడంతో వాడు రెచ్చిపోయాడు. "మరట్లే రాజుగారు అడగటం ఏందీ... మనవాడి పెయి సొక్కి" అబ్బో... మహరాజా... మన దేశం సుభిక్షం.. అది మీ బిక్షం... జనాలకు వద్దన్నా తిండి... తాగినన్ని నీళ్ళు... పంటలే పంటలు... అసలు సొర్గం యాడ్నో లేదూ... అంతా మీ జమానాలోనే వుందని పాటలు పాడి భోషనులే చేస్తంద్రు మహారాజా...!" రాజుగారేమో వుబ్బి తబ్బిబ్బులై అంతెత్తున చాతీ పొంగిచ్చి "ఆ... బోలో... చెప్పు... ఇంకా చెప్పు"! అని వాడ్ని ఎగేసేవాడు.

"రేపు చచ్చినంక ఇంగ స్వర్గసుఖాలెందుకూ... అసలు సావడం ఎందుకూ... ఇంతకంటే మరో సొరగం యాడుంటుదీ... అని ప్రెజలంతా ఒకటే గుబులు మా రాజా!"

అట్లా మంగలి రాజుకు వళ్ళు పదుతున్నపుడు – గడ్డం గీకేటపుడు వుబకేసేవాడు. అయితే ఒకరోజు స్తంబం చాటు నుండి ఇదంతా వింటున్న మంత్రికి వళ్ళు మండిపోయింది. ఎందుకంటే రాజ్యంలో వానల్లేవు... పంటల్లేవు.. పనుల్లేవు... తాగునీరు లేదు. కొందరు రైతులు తెగబడి వురులు పెట్టుకుంటుంద్రు! అంతటా భయంకరమైన కరువు – జనాలు పనులకు వలసలు పోతంద్రు! మరి మంగలి ఇట్ల తగులుకుని వాగుతడా! అని బాగ ఆలోచన చేసి ఆ రోజు మంత్రి మంగలి వెనకబడి వాడింటి వెనక చేరి, కిటికీల్నుండి తొంగి చూసిండు. వాడు ఒక చిన్న చెక్క తనబ్బీ తెరిచి దాన్లె నుండి ఒక బంగారు గుడ్డును తీసి పరీక్ష చేసి, ముద్దు పెట్టుకుని మళ్ళా తనబ్బిల పెట్టి బువ్వతింటానికి లోపలికి పోయిండు. మంత్రి చాతుర్యంగా చెయ్యిబారజాపి ఆ తనబ్బీల నుండి ఆ బంగారు గుడ్డును తీసి కూసం జేబు లేసుకుని వెళ్ళిపోయిండు.

మర్నాడు –

ఎప్పటిలాంగనె రాజుగారు మంగలిని దేశం గురించి అడగనే అడిగిండు – వాడు ఒక్కతాలె బావురుమని ఏడ్వడంతో రాజుగారు అదిరిపోయిండు.

"అరె.. ఏమైంది – గట్ల ఏడుస్తవ్...' మన రాజ్యం ఎట్లుందిరా... ఎవులన్నా సచ్చింద్రా.. అంతా బాగే గదర!" అన్నాడు.

"యాడబాగు మారాజా... అంతా ఆలగోడు – బాలగోడు... జనాలు తిండి దొరక్క చస్తంద్రు – నీళ్ళు లేవు.. యగసాయం లేదు... మీ సాయం లేదు. తిడతంద్రు... నరకం అంటే గిట్లనే వుంటదని పాటలు గట్టి పాడతంద్రు..." అని వాడు ఒకటే ఏడుపు.. ఒకటే చీదుడు!

అపుడు మంత్రి వచ్చి అసలు సంగతి చెప్పిండు "– జక్కులోడు కత ఇక్కడిదాకా చెప్పంగనే వాడి పెండ్లం కింద మీద పడి నవ్వబట్టె! "సొరగం... నరకం... బాగుందయ్యా కథ.. అన్నా.. అరె.. నువ్వు సైసు.. యాద్గిరన్న గాడ్నే కూసుంటివి – లోపలికి రావే!" అనంగనే యాద్గిరి లోపలకొచ్చి స్టూలు పీట మీద కూలబడిండు. ఆమె గలాసెడు మంచి నీళ్ళిచ్చింది.

"ఏందిర కైతకాలు చెప్తన్నావ్.. గివి కూడా సురూ చేసినవేర! బాగుంది కథ... అమ్మా చెల్లెమ్మా.. మంగలి పొదిలోని గుడ్డు కథ చాలా పాతదిగాని... ఇప్పటి గమ్మతైన కథ కాస్తంత చెప్పనా!" అన్నాడు.

"చెప్పన్నా... చెప్పవే.. నువ్ బాగ కథలు చెప్తవు గద"! అని సదురుకుని కూకుంది –

"మన కేంద్రంలో భా.జ.పా. యన్డీయే – పార్టీ ఓడిపోకముందు మన ప్రధాని వాజ్‌పేయి గారు 'భారత్ వెలిగిపోతోంది" అబ్బో "అంతా వెలుగే" అని ఒకటే సన్నాయి పెట్టిండు – ఆయన అధికారంలో ఎంతమంది నేరగాండ్లు మంత్రులుగా వుండిరి. ఎంతమంది! అమెరికోడికి ఒంగొంగి సలాములు చేసిండు. మరిగిపుడు గద్దె దిగంగానె గంగెర్రులెత్తి పోతండు – యుపిఏలో ఆయనకు మంత్రులు నేరగాండ్లుగా కనిపిస్తంద్రు – కమూనిస్టులు పెత్తనం చేస్తరంటడు – తన బుజాల మీద సవారీ చేసే ఆరెస్సెస్ సంగతెత్తలేదుగద! గుడ్డుపోయిన మంగలి తరీకున ఒకటే లొల్లిపెడ్తండు.

ఇంగ మన తె.దే. చంద్రబాబు గారిదీ అదే దోవ. తన హయాంలో ఫాక్షనిజం అస్సలు లేనేలేనట్టు... సీమ రాజకీయాల్లో ఒక్క నెత్తురు బొట్టు రాలనట్టు ఆవేశపడతండు – ఇపుడున్న గవర్మెంటు మీద కారాలు నూరుతండు – రైతులు గీ రెండు నెలల్నుండి మెడలకు వురులు తగిలిచ్చుకుని, మందుతాగి సస్తంద్రని బల్లలు సరుస్తంద్రు – తమ బంగారు గుడ్డు పదిలంగున్న తొమ్మిదేండ్లలో గివి ఆలిండియా రికార్డయిపాయె! తన అవినీతి విచారణలను బయటపెడితే బుజాలు లేపుతండు. తన బంగారు గుడ్డు (అధికారం) వున్నపుడు ప్రజలంతా చాలా కుషీగున్నరని టీవీల్ల – పేపర్లల్ల సభలల్ల ఒకటే దంచుడు. గా గుడ్డు వూడిపోయినంక అన్ని కష్టాలే ! అదే... ఏదైనా తనదనకా వస్తేగాని అసలెవ్వారం బయటకురాదు. సామెతుంది గద...

యాద్గిరి చెప్తనే వున్నాడు. జక్కులోడు సొంచాయించలేక నిద్దట్లకు జారగిలబడ్డడు.

❖

నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న పెద్ద ఆరోగ్య సమస్య స్థూలకాయం (భారీ కాయం). స్థూలకాయాన్నే మహాకాయం, ఊబకాయం అని కూడా పిలుస్తారు. ఒబేసిటీ అంటే అధిక బరువు, లావు శరీరమే. ఆధునిక కాలంలో మనం ఎదుర్కొంటున్న సమస్య అధిక కొవ్వు. చెడ్డ కొలెస్టరాల్ వల్ల గుండెనొప్పి, ఇతర గుండె జబ్బులు, పొట్ట, పిరుదులు, తొడల్లో కొవ్వు పేరుకుని నేటితరం యువతీ యువకులు సైతం ఎన్నో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు

డా॥ కామేశ్ పేరి, సుమశ్రీ ఒబేసిటీ అండ్ హెల్త్ క్లినిక్, హైదరాబాద్



'స్థూలకాయం - బొజ్జ'లతో భలే కష్టాలు!

ఇంటర్నేషనల్ ఒబేసిటీ టాస్క్‌ఫోర్స్ అంచనాల ప్రకారం 30 శాతానికి పైగా ఒబేసిటీ, ఒబేసిటీ వలన వచ్చే ఇతర సమస్యలతో బాధపడుతున్నారు. ఒబేసిటీ అనేది వ్యాధి కాదు, ఒక శారీరక లోపం మాత్రమే. శరీర స్థితిగతుల్లో మార్పు అంటే థైరాయిడ్ హార్మోన్ల లోపం ముఖ్యంగా స్త్రీలల్లో ఇది ఎక్కువగా వున్నట్లు తేలింది. పీరియడ్ల (రుతుచక్రం) సమస్యలు, సిజేరియన్ల తరువాత సరైన శారీరక వ్యాయామం లేకపోవడం వలన అధిక బరువు, పొట్ట, లావు పెరగడం జరుగుతున్నది. ఆధునిక కాలంలో వంటావార్పుల్లో తగిన శ్రమలేకపోవడం అంటే స్త్రీలు తగినంత శారీరక శ్రమలేకుండానే ఫ్రిజ్‌లు, కుక్కర్లు, పాన్‌లు, గ్రైండర్లు, మైక్రోఓవెన్‌లు, బ్లెండర్‌ల సహాయంతో తమ వంట పనులు చేసుకోగలుగుతుండడం కూడా అధిక బరువు పెరగడానికి కారణం అవుతున్నది.

ఆఫీసుల్లో సైతం చెమట పట్టే పని లేకుండా ఏసీలు, కూలర్లు ఉంటున్నాయి. ఈ మధ్యకాలంలో ఈ విపరీత స్థూలకాయంతో కనీసం నడవలేని పరిస్థితి నగరాల్లోనూ, పట్టణాలలోని వారికి కలుగుతున్నది. అభివృద్ధి చెందిన దేశాలలో ఈ సమస్య గత ఎంతోకాలంగా వున్నప్పటికీ మన దేశంలో ఇప్పుడిప్పుడే పెరుగుతూ వస్తున్నది. అసలే సగం మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్న ఈ రోజుల్లో అధికంగా తిండి వలన, హార్మోన్ల లోపం వలన, ఇతర ఆధునిక సమస్యల వల్ల మన దేశంలో 20 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల మధ్య వయస్సున్న వారిలో ముఖ్యంగా స్త్రీలలో సగం మంది ఒబేసిటీ బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన అంతర్జాతీయ ఒబేసిటీ టాస్క్‌ఫోర్స్ తేల్చింది. ముఖ్యంగా పురుషుల్లో పొట్ట లేదా బొజ్జ బాగా కనిపిస్తున్నది. గతంలో చిరుబొజ్జ వుంటే ఒక వ్యక్తి తన జీవితంలో స్థిరపడి సుఖంగా వున్నట్లు భావించే వారు. ఇది ఈ రోజు ప్రాణాంతకంగా మారిందని చెప్పవచ్చు. స్థూలకాయం వలన చక్కెర వ్యాధిగ్రస్తులు మన దేశంలో పెరిగారు. మన రాష్ట్రంలో అయితే హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడలలో చక్కెర వ్యాధిగ్రస్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వయస్సుతో నిమిత్తం లేకుండా పెరుగుతున్న ఈ స్థూలకాయ సమస్య వలన ఈ కింది ఆరోగ్య సమస్యలు కలుగుతున్నాయి.

అధిక రక్తపోటు (హైబీపీ), చక్కెర వ్యాధి, పక్షవాతం, గుండెజబ్బులు, రకరకాల క్యాన్సర్లు, బ్రెస్ట్‌క్యాన్సర్, అబ్డామినల్, కొలిక్ క్యాన్సర్లు, మలబద్ధకం, ఆర్థ్రైటిస్ వంటి కీళ్ళ సమస్యలు, గాల్‌బ్లాడర్ సమస్యలు, నిద్రలేకపోవడం, గురకపెట్టడం, సంతానం కలగకపోవడం, స్త్రీలలో పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్, నడుం నొప్పి, సయాటికా, స్పాండిలైటిస్ మొదలైనవి.

అన్నింటికన్నా ముఖ్యంగా ఈ సమస్యలలో అన్నీ లేకపోయినా కొన్నైనా ఉండి ఆయుర్దాయం, మనిషి జీవితకాలం తగ్గిపోవడం.

ఇలాంటి పరిస్థితుల్లో పట్టణాల్లోనూ, నగరాల్లోనూ వున్న ప్రజలే కాకుండా పల్లెల్లో సైతం ఒబేసిటీ సమస్య బారిన పడుతున్నారు. అయినా స్థూలకాయ సమస్య వ్యక్తి ఆహారపుటలవాట్లు, మానసిక సమస్యలు, ఆల్కహాల్, డ్రగ్స్, సిగరెట్లు, టీలు అధికంగా తాగడం వల్లనే కాక వంశపారంపర్యంగా కూడా ఒబేసిటీ 25 నుండి 75 శాతం వస్తున్నది. తల్లిదండ్రుల్లో ఇద్దరూ లావుగా వుంటే 75 శాతం పిల్లల్లో లావు పెరుగుతారని తేలింది. దీనిని బట్టి ప్రతి వ్యక్తీ ఈ సమస్యపై దృష్టి మరల్చాల్సిన పరిస్థితి వుంది. లేకుంటే 2025 సంవత్సరం నాటికి 6 నుండి 7 కోట్ల మంది ఊబకాయంతో సతమతమవుతారని అంచనా.

ఏ దేశ ఆర్థిక పరిస్థితి చూసినా ఆ దేశ ప్రజల ఆరోగ్యంపై ఆధారపడి వుంటుందనేది నిర్వివాదాంశం. 'ఆరోగ్యమే మహాభాగ్యమ'ని వూరికే అనలేదు పెద్దలు. ఈరోజు కొద్దిపాటి అనారోగ్యం వచ్చినా వేలకు వేల రూపాయలు మందుల కోసం, హాస్పిటల్స్ బిల్లుల కోసం ఖర్చవుతున్నాయి.

ముఖ్యంగా అధిక బరువు, పొట్ట, లావు తగ్గాలంటే ఆహార, ఆచార వ్యవహారాల్లో మార్పు తీసుకురావాలి. ఫాస్ట్‌ఫుడ్‌ల కాలం బట్టి తగిన జాగ్రత్తలు అవసరం.

ఒబేసిటీ నివారణకు సూచనలు :

1. కొవ్వు, నూనెల వాడకం తగ్గించి, బిర్యాని, మసాలా పదార్థాలు తినడం తప్పనిసరిగా తగ్గించాలి.
2. మెస్‌లలోనూ, హోటళ్ళలోనూ, రోటీ, పన్నీర్ కూరలు తినడాన్ని కంట్రోల్ చేసుకోవాలి.
3. ఉదయాన్నే ఉషఃపానం మంచిది. అంటే ఉషోదయాన మంచినీరు తాగడం మంచిది.
4. తెల్లవారుఝామునే లేస్తే మంచిది. వెంటనే మంచినీరు తాగి, కాలకృత్యాలు తీర్చుకొని నడక ప్రారంభించాలి. అంటే వాకింగ్, జాగింగ్, రన్నింగ్‌లలో ఎక్కువ కాలరీలు ఖర్చవుతాయి. ఈ విధంగా చేయడం వలన గుండె జబ్బులు రావు. ముందుగానే జబ్బులున్నవారు వెంటనే

డాక్టర్ల సలహా మేరకు వాకింగ్, బ్రిస్క్ వాకింగ్ మొదలెట్టాలి.

5. అధిక బరువున్న వారిలో అధిక శాతం మందికి పైల్స్ సమస్య వుంటున్నది. కాబట్టి మలబద్ధకం, గ్యాస్ ట్రబుల్ లేకుండా చూసుకోవాలి. ఆఫీసుల్లోనూ, షాపుల్లోనూ కూర్చునే వారు ఎక్కువసేపు ఒకే విధంగా కూర్చోకుండా ఏంగిల్స్ మార్చుకోవాలి. మధ్యమధ్యలో ఏదో ఒక పని కల్పించుకొని అటూ ఇటూ లేచి వెళ్ళడం చేయాలి.

6. నడుం నొప్పి స్థూలకాయులకు ప్రధాన సమస్యగా ఉంది. యోగాలో చిన్న చిన్న ఆసనాలు వేయడం నేర్చుకోవాలి. ఎవరి కుర్చీల్లో వారు నిటారుగా నడుం ఉంచుకొని పనులు చేసుకోవాలి. ఆధునిక కాలం కంప్యూటర్ల వాడకం వలన 30 సంవత్సరాల లోపు వారికే ఈ సమస్య పెరిగింది. కాబట్టి మధ్యమధ్యలో విశ్రాంతి అవసరం.

7. నిత్యం నడవాలి. వాహనాల వాడకం తగ్గిస్తే కాలుష్యం కూడా తగ్గుతుంది. మోడర్న్ సైకిలు వాడవచ్చు.

8. మాంసాహారం కన్నా శాఖాహారానికే ప్రాధాన్యతనివ్వాలి. పండ్లు కూరగాయలు తినాలి.

9. ఈ మధ్య నగరాల్లో ఉదయాన్నే నడక సాగించే వారి సంఖ్య పెరిగింది. కారణం ఆరోగ్య సమస్యల నుంచి బయటపడాలను కోవడం. మానసికంగా మనిషి సిద్ధంగా వుంటే ఎటువంటి ఆరోగ్య సమస్యా తలెత్తదు. ఈనాటి వర్కింగ్ ఉమెన్ అధికంగా ఆలోచించడం, ఇంటా బయటా సమస్యలతో సతమతమై నిద్రలేక డ్రగ్స్ వాడడం మొదలుపెడుతున్నారు. దీనివలన తాత్కాలిక ఉపశమనం కలిగినా శాశ్వత ఆరోగ్య సమస్యలైన ఒబేసిటీ, మధుమేహం కలుగుతున్నాయి.

10. కొవ్వు, కొలెస్ట్రరాల్ అధికంగా వున్న స్థూలకాయుల్లో గుండెజబ్బులు, బ్లడ్‌క్లాటింగ్ జరిగి బైపాస్ సర్జరీల అవసరం పెరిగి సగటు మానవుడి ఆయుర్దాయం సగం తగ్గడమే కాక ఆర్థికంగా ఇబ్బందుల్లో పడుతున్నారు. ఈ రోజు ఆరోగ్యంగా వున్నవాడు ఎంతో ఆర్థికంగా బలంగా వున్నట్లు లెక్కించవచ్చు. అధికంగా నూనె పదార్థాలు, బేకరీ ఫుడ్స్ వాడకం తగ్గించి వయసుకు తగ్గ ఆహారం తినడం వల్ల వీటి నుండి బయటపడవచ్చు. భోజనం చేసిన వెంటనే నిద్రపోకూడదు.

11. హెల్త్ సైకాలజిస్ట్‌గా నేను అధిక బరువున్న వారిని, సన్నగా వున్న వారిని పరిశీలించి నపుడు సన్నగా వున్న వారిలో చాలా శాతం చక్కటి ఆరోగ్యంతో ఎటువంటి సమస్యలు లేకుండా వున్నారని తేలింది.

12. మాంసాహారుల కన్నా శాఖాహారుల జీవితకాలం ఎక్కువగా ఉన్నట్లు గమనించాను. దీనినిబట్టి వెజిటేరియన్ ఫుడ్స్ వాడకం తప్పనిసరిగా పెంచుకోవాలి.

13. తేనె, నిమ్మకాయ, గోరువెచ్చని నీటికి బరువు తగ్గడంలో చక్కని పాత్ర వున్నది. ప్రపంచ వ్యాప్తంగా వంటింటి చిట్కాగా దీనిని వాడతారు. శరీరాన్ని ఉత్సాహంగా వుంచడమే కాక శరీరంలోని రక్తాన్ని శుభ్రపరచడం దీని ముఖ్యలక్షణం. తద్వారా వ్యర్థపదార్థాల డిపాజిట్స్ తగ్గుతాయి. అంటే రిజర్వ్‌డ్ ఎనర్జీగా మారే కొవ్వు శాతం తగ్గుతుంది. ఇది జీవితాంతం ఆచరించవలసిన నియమం కూడా.

14. కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థుల్లో మెస్‌లలో తినడం, వేస్ట్ ఫుడ్స్ లేదా జంక్ ఫుడ్స్, పీచు పదార్థాలు ఎక్కువగా లేని ఆహార పదార్థాలు తినడం వలన లావు, పొట్ట సమస్య వస్తున్నది. భారతీయుల్లో పీచు పదార్థాలు తినకపోవడం వల్ల మధుమేహం పెరుగుతున్నట్టు ఆహార సంస్థ సర్వేలలో తేలింది. సాధ్యమైనంత వరకు ఇవి తినకుండా వుండాలి.

15. అన్నం ఎక్కువ తినకుండా ఆకుకూరలు, కూరగాయలతో చేసిన కూరలు ఎక్కువగా తినాలి. బియ్యానికి ప్రత్యామ్నాయంగా గోధుమలు, జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, ఉలవలు, బార్లీ మొదలైనవి వాడడం పెంచుకోవాలి.



16. కర్నాటక రాష్ట్రంలో 'కంజికిట్'కు ప్రాధాన్యత పెరిగింది. అంటే మొలకెత్తే గింజలు అన్నీ కలిపి స్ప్రౌటెడ్ డైట్‌గా తినడం చేయాలి. బ్రేక్‌ఫాస్ట్‌గా ఇది బాగా ఉపయోగపడే ఆహారం. నేచురోపతి వైద్యులు దీనికి అమితమైన ప్రాధాన్యమిస్తారు.

17. బరువు తగ్గడానికి ఈనాడు ఆధునిక వైద్యంలో మందులు లేవు. అయితే ఆధునిక డ్రగ్స్ అంటే అల్లోపతి డ్రగ్స్ అధికంగా వాడడం, కాఫ్ సిరప్‌లు, అనాల్జెసిక్స్ ఎక్కువగా వాడడం, నిద్రమాత్రలు, విటమిన్ మాత్రలు ఎవరి సలహాలు లేకుండా వేసుకోవడం వల్ల కూడా ఒబేసిటీ పెరుగుతోంది.

18. మానసిక అశాంతి వుంటే వెంటనే దానికి తగ్గ పరిష్కారం చూసుకోవాలి. సైకలాజికల్ కౌన్సిలింగ్ ద్వారా సమస్యకు పరిష్కారం చూసుకోవాలి. మందులు తప్పనిసరైతే తప్ప వాడకూడదు.

19. అధిక బరువు తగ్గడం అనేది ఒక రోజులో జరిగేది కాదు. ఏదో ఒక మందు ద్వారానో తగ్గేది కాదు. దీనికి నేచురల్‌గానూ, హెర్బల్ మెడిసిన్స్‌తోనూ, యోగాభ్యాసం, ఆధునిక ఏరోబిక్స్, జిమ్‌లలోనూ కొద్దిపాటి పరిష్కారం వుంది. అయితే ఆహారం ఒక్కటే మానేయడం వల్లనూ, పై వాటిలో ఏ ఒక్క పద్ధతి ద్వారానో బరువు, లావు తగ్గడం జరగదు. కావున అధిక బరువు తగ్గాల్సిన వారు, ఆహారపుటలవాట్లే కాకుండా ఫిజికల్ ఎక్సర్‌సైజులు, నడక, హెర్బల్స్ వాడటం మొదలైన వాటన్నింటి ద్వారానూ తగ్గడానికి ప్రయత్నించాలి.
అంటే బరువు తగ్గడానికి బజార్లో దొరికే మాగ్నటిక్ బెల్ట్‌లు, స్టిక్కర్లు, విటమిన్ టాబ్లెట్లు సరైన పరిష్కారం కాదు. ఒక యుద్ధ సైనికుడిలా తనకున్న ప్రత్యామ్నాయాలన్నింటినీ వాడుకోవాలి.

20. ప్రస్తుతం ఆధునిక క్లినిక్‌లలో అట్కిన్సన్ డైట్, సోమర్‌సైజింగ్ డైట్, ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్‌తోను బరువు తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే కొద్దిపాటి ఫలితం వున్నప్పటికీ పూర్తిస్థాయిలో బరువు తగ్గి ఆరోగ్యంగా వుండాలంటే ఇవి సరిపోవడం లేదు.

21. ఆధునిక చికిత్సలతో పాటు హెర్బల్, ఆయుర్వేదం, హోమియోపతి, నేచురోపతి, యోగాభ్యాసం, ధ్యానం, వాకింగ్, జాగింగ్, ఆధునిక ఏరోబిక్స్‌లో చక్కటి ప్రత్యామ్నాయ మార్గాలు వున్నాయి.

కావున హార్మోన్లలోపం, థైరాయిడ్ లోపం, సిజేరియన్స్ అయ్యాక సమస్యలకు సరైన డాక్టర్లు, డైటీషియన్, ఫిట్‌నెస్ కన్సల్టెంట్‌ల ఆధ్వర్యంలో పరిష్కారం చూసుకోవాలి.

వీటన్నింటికన్నా ముందు మానసికంగా ట్రీట్‌మెంట్‌లకు సిద్ధమవడం, ఆహారపుటలవాట్లు, ఆచార వ్యవహారాల్లోనూ, ఆలోచనల్లోను వ్యక్తిగత వైఖరుల్లోనూ మార్పు తెచ్చుకోవడం తప్పనిసరి. ఎన్నో పరిష్కారాలు వున్నప్పటికీ ముఖ్యంగా పైన తెలిపిన వాటిపై శ్రద్ధ చూపి ప్రజలందరూ ఒబేసిటీ బారిన పడకుండా తగిన పరిష్కారం చూసుకోవాలి.

కుటుంబ సంబంధాల్లో స్త్రీ

వాసిరెడ్డి సీతాదేవి సమగ్ర సాహిత్యాన్ని సంపుటాలుగా వెలువరించే దిశలో "తొణికిన స్వప్నం, మళ్ళీ తెల్లవారింది, బొమ్మరిల్లు" అనే మూడు నవలలను విశాలాంధ్ర వారు ఆరవ సంపుటిగా వెలువరించారు.

మొదటి నవల "తొణికిన స్వప్నం". స్ప్లిట్ పర్సనాల్టీ (Split Personality) అనే ఒక క్లిష్టమైన సైకాలజీ అంశానికి ఇది నవలా రూపం. ఇన్‌ఫీరియార్టీ కాంప్లెక్సును అణచిపెట్టుకునే ప్రయత్నంలో తెచ్చిపెట్టుకున్న సుపీరియార్టీ కాంప్లెక్సుతో మనుషులు ఎలా ప్రవర్తిస్తారో తెలియజేయడానికి నిదర్శనం. రాధ, తండ్రి చనిపోగా పసిగుడ్డుగా వున్నప్పుడే మేనమామ పంచన చేరి వాళ్ళ నిరాదరణకు గురై ఎన్నో అవమానాలకు గురవుతుంది. రాధ తన పరిస్థితుల మీద కలిగిన కసితో అందరు వద్దంటున్నా పట్టుదలగా చదివి ఉద్యోగురాలవుతోంది. చిన్నప్పటి నుండి ఆడవాళ్ళ మీద కొనసాగే ఆంక్షలు, చిన్నప్పటి సంఘటనలు, 'ఆడది, ఆడది' అంటూ ఆడదాన్ని కించబరచే ఆచారాలు, స్త్రీలను సెక్స్ ఆబ్జెక్టుగా చూసే పంతులు, ఆమెతో ఆడుకున్న చిన్ననాటి మగపిల్లలు, రంగారావు ప్రవర్తన ఆమె వనిమనసును గాయపరుస్తాయి. ఇంటా-బయటా జరిగే అవమానాలు, ఆంక్షలతో ఆమెలో ఒక విధమైన ఆత్మన్యూనతా భావం ఏర్పడుతుంది. ప్రేమ-పెళ్ళి పేరుతో మగాడి స్వార్థం, అవకాశవాదాన్ని గుర్తించిన రాధ ప్రేమ అంటేనే మండిపడే స్థితికి వస్తుంది. అలా క్రమంగా ఇన్‌ఫీరియార్టీ స్థితి నుండి సుపీరియారిటీ కాంప్లెక్సుకు చేరుకుంటుంది. రాధ సైకాలజీని డాక్టర్ రాహుల్ అర్థం చేసుకుంటాడు. ఆమె పట్ల రాహుల్ కనబరచిన ఆదరణతో బాధలో ఉన్న రాధ, తన మనస్సును అతనికి తెలియజేయాలనుకుంటుంది. అందుకు కూడా వెనుకాడి మానసిక ఘర్షణతో ఆసుపత్రి పాలవుతుంది. తన ఒంటరి జీవితాన్ని తలచుకొని, తాను జీవితంలో ఏం కోల్పోయిందో తెలుసుకుని పశ్చాత్తాపపడుతుంది- డాక్టర్ రాహుల్ స్వీకారంతో మొత్తానికి రాధ జీవితం సుఖాంతమవుతుంది.



వాసిరెడ్డి సీతాదేవి
సాహిత్యం-6 (నవలలు)
తొణికిన స్వప్నం, మళ్ళీ తెల్లవారింది, బొమ్మరిల్లు
ముద్రణ మరియు ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
వెల: రు.150/-; పేజీలు : 400

కుటుంబ సంబంధాలన్నీ డబ్బు చుట్టే తిరుగుతాయని రచయిత్రి మిగతా రెండు నవలల్లో నిరూపించిన విధానం బాగుంది. తమ పిల్లలు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని తల్లిదండ్రులు కష్టపడి వాళ్ళను ప్రయోజకులుగా చేస్తే రెక్కలొచ్చిన పిల్లలు ఎగిరిపోగా - వాళ్ళ నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన ముసలి తల్లిదండ్రులకు 'ఓల్డ్ ఏజ్ హోం'లే దిక్కుకావడం ఎంత విషాదకరం. అందరూ వుండి అనాథగా మారిన సుందరమ్మ ఆత్మక్షోభను అద్భుతంగా వివరించిన నవల "మళ్ళీ తెల్లవారింది", "బొమ్మరిల్లు" నవలలో తండ్రి చనిపోగా డాక్టర్ పూర్తి చేసిన రేణుక తన ప్రేమ వివాహాన్ని వాయిదా వేసుకొని ఇంటి బాధ్యతలను స్వీకరిస్తుంది. తమ్ముళ్ళను చదివించి ప్రయోజకులను చేసి, చెల్లెళ్ళను పెంచి పెళ్ళిళ్ళు చేస్తుంది. అయినా అందరూ ఆమె గురించి కాక, ఆమె డబ్బు కోసం వెంపర్లాడిపోవడం రేణుకకు బాధను కలిగిస్తుంది. విఫలమైన వివాహం ఆమెలో విరక్తిని పెంచుతుంది. అందరు వుండి ఎవరూలేని ఒంటరితనం - డబ్బు సంబంధాలే తప్ప రక్త సంబంధాలకు విలువలేదని తెలుసుకుంటుంది. చివరకు అన్నింటిమీద విరక్తితో ఓల్డ్ ఏజ్ హోం ప్రారంభించి వాళ్ళ సేవకై తన జీవితాన్ని అంకితం చేస్తుంది.

ఈ మూడు నవలలు కూడా ఏ ఆధారం లేని స్త్రీల ఒంటరి జీవితాలు ఎలాగుంటాయో వివరిస్తాయి. ఈ మూడు నవలల్లోని స్త్రీలు తమ పరిస్థితులకు ఎదురీది తమ కర్తవ్యాన్ని ఎలా అంకితభావంతో పూర్తి చేశారో తెలియజేస్తాయి. వాళ్ళ జీవితాలు ఎన్ని మలుపులు తిరిగినా ఆడది అంటే అబలకాదు అన్న విషయాన్ని ఇందులోని స్త్రీ పాత్రలు నిరూపించడం విశేషం.

- కె.పి.అశోక్ కుమార్

స్వీకారం



పెంపుడు కుక్కలు - సంరక్షణ

రచన : డా॥ సి. హెచ్. రమేశ్, డా॥ వై. కస్పారెడ్డి; వెల : రూ. 75/-; ప్రతులకు : శ్రీమతి జి.సరి... సి-302, పూజిత అపార్ట్‌మెంట్, హైదరాబాద్ రో... నల్గొండ; కెనైన్ క్లినిక్, కొరిటిపాడ్ లైబ్రరీ దగ్గ... గుంటూరు.

పగిలిన అద్దం

రచన : ముక్తవరం పార్థసారధి; వెల : రూ. ...
ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, ప్లాట్ నెం...
బాలాజీనగర్, గుడిమల్కాపూర్,
మెహదీపట్నం, హైదరాబాద్

కలలు నేలమీదికి

రచన : మానేపల్లి; వెల : రూ. 25/-; ప్రతు...
బుక్ అండ్ బుక్స్, విద్యానగర్, ఎలమంచ...
ప్రజాశక్తి బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్,
బ్రాంచీలు; నవోదయ, దిశ, హైదరాబా...

జల సౌందర్యాల కేరళ

కేరళను భూతలస్వర్గంగా చెప్పుకుంటారు. ఇంకా నదులు, కాల్వలు, సరస్సులకు కంఠహారం అనికూడా అంటారు. ఇక్కడి జలాశయాలను స్థానికుల పరిభాషలో అప్రవాహ జలంగా, బ్యాక్ వాటర్‌గా పేర్కొంటారు. ఈ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో విరిసిన సహజ ప్రకృతి అందాలు ప్రపంచంలో మరెక్కడా కనిపించవు. నదులు, సరస్సులు అన్నీ కలిసి 44 నదులు సంగమించి అరేబియా సముద్రంలో కలుస్తాయి. ఈ క్రమంలో ఈ నదీ ప్రవాహ ప్రాంతాలన్నీ ప్రకృతి శోభాయమానంగా స్వర్గతుల్యంగా కనిపిస్తాయి. ఈ సంగమ జల ప్రవాహం 900 కి.మీ. పొడవునా సాగి ఇక్కడి గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ రవాణా మార్గంగా ఉపయోగపడుతున్నది.

హెచ్.రమేష్‌బాబు

ఇక్కడి బ్యాక్‌వాటర్ ప్రాంతాల ప్రజలకు నాటు పడవల తయారీ, ఇసుక రవాణా, కొబ్బరితోటల పెంపకం, సున్నపురాయి సేకరణ, వరి పండించడం, బాతుల పెంపకం, ఇతర రకాల పంటలు పండించడం వంటివి ప్రధాన వృత్తులు. ఈ బ్యాక్‌వాటర్ అందాలను చూసేందుకు పర్యాటకులు తమ ప్రయాణాన్ని సాధారణంగా అలప్పుజా నుండి ప్రారంభిస్తారు. అలప్పుజానే అలెప్పీ అని కూడా అంటారు. చిన్న చిన్న కాలువల ద్వారా అనేక మైళ్ళ మలుపులతో సాగి వేమబ్‌నాడ్ సరస్సు వద్ద ముగిస్తారు.

నిరంతరం వరి పండే కుట్టనాడ్ ఇక్కడ ప్రముఖ స్థలం. ఎందుకంటే ఇది సముద్ర మట్టానికి దిగువన ఉండడం. ఈ 900 కి.మీ. ప్రయాణం మూడు జిల్లాలు దాటి కొచ్చిన్ తీరం ద్వారా సముద్ర ముఖద్వారం చేరుకుంటుంది. ఎనిమిది పాయలుగా చీలిన హస్తముడి సరోవరం ఎక్కువ మొత్తంలో బ్యాక్‌వాటర్‌ను కలిగి ఉంది. దక్షిణ కేరళలోని కల్లామ్ జిల్లాలో అత్యధిక భాగాన్ని ఆక్రమించి బ్యాక్ వాటర్‌కు ముఖద్వారంగా పేరొందింది.

తేలికైన పడవలు తేలియాడుతూ అత్యధిక పర్యాటకులను ఆకర్షించే ప్రాంతం కెట్టువల్లమ్. సంప్రదాయక హౌస్‌బోట్లు పలు సౌకర్యాలతో ఉంటాయి. వాటిల్లో పచ్చని ప్రకృతి అందాల మధ్య బ్యాక్ వాటర్‌పై చేసే ప్రయాణం మానస సరోవర్ విహారాన్ని మరిపిస్తోంది.

కుమారకమ్ మరొక అద్భుత బ్యాక్‌వాటర్ ప్రాంతంగా, అద్భుత హాలిడే స్పాట్‌గా పేరొందింది. ఇక్కడే 14 ఎకరాల విస్తీర్ణంలో అరుదైన పక్షుల విహార కేంద్రం ఉంది. నీటిబాతులు, కోకిలలు, సైబీరియన్ స్ట్రోక్స్ మొదలైన పక్షులను ఇక్కడ చూడవచ్చు. ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా అద్భుత ప్రకృతి సౌందర్య శోభలకు నెలవైన కేరళ బాక్‌వాటర్ పరిసర ప్రాంతాలను సందర్శించడం గొప్ప అనుభూతి. ✿

ఆత్మీయతకు ఆనవాలు

ఆచార్య తిరుమల

సాధన నరసింహాచార్య

"అలుపెరుగని చైతన్యం, అక్షరాలా అతని వృత్తి
వెరపెరుగని అతని కలం, వెలకందని అగరువత్తి"

అన్న మల్లెమాల అక్షరసత్యాలు తిరుమలగారి నిత్య చైతన్యతత్వానికి, పరిపూర్ణ వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయి. ఆత్మీయత, ఆర్ద్రత, ఆప్యాయతలకు జీవలక్షణాలను ఆపాదిస్తే అవి ఆచార్య తిరుమలగారి ఆత్మతత్వానికి ప్రతీకలౌతాయి. వారి వదనంలోని ప్రసన్నత, మాటల్లోని ప్రఫుల్లత, ఎలాంటి వారికైనా ఆత్మవిశ్వాసాన్ని, అందరికీ ఉపయోగపడాలన్న సంకల్పాన్ని కల్గించకమానవు.

క్రొత్తగా కవిత్వాన్ని రాస్తున్న ఎవరైనా, ఏమాత్రం పరిచయం లేకున్నా "మాస్టారూ! కవిత రాశాను చూస్తారా?" అని అడిగితే, ఏ మాత్రం భేషజం, విసుగు లేకుండా అమ్మలా ఆప్యాయత పంచుతూ, గురువులా ఆ కవితలోని అందాలను వెలికితేవడం, ఆ నవకవి చేత మరెన్నో కవితలు రాయించి వాటిని సంకలనంగా రూపకల్పన చేయడం, భావాత్మక మకుటాన్ని (శీర్షిక) సూచించడం తిరుమలగారి హాబీ. అంతే కాకుండా ఆత్మీయంగా, మంచి ఆవిష్కరణసభను ఏర్పాటు చేసి ఆ కవిని సాహిత్యలోకానికి పరిచయం చేయడం, అతని పురోగతిని చూసి గురువుగా మురిసిపోవడం వారి నైజం. అలా వారి చేతి చలవ వల్ల ఉన్నత శిఖరాలను చేరి దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ప్రవర్ధమాన కవులెందరో...

ఎవరిలోనైనా నిర్వహణ సామర్థ్యం దాగి వుంటే, ఆ సామర్థ్యాన్ని పసిగట్టడం, అతని అభిరుచికి తగ్గట్టుగా సంస్థను రూపుదిద్ది, దానికి నామకరణం నుండి రజతోత్సవ వార్షికోత్సవం వరకు నిర్వహింపచేయడం, ముఖ్యంగా సాహిత్యసభల్లో, కవి సమ్మేళనాలలో యువకవులకు, కవయిత్రులకు, పెద్దల సర[...] స్థానం కల్పించడం, ఆ నవకవితలోని మాధుర్యాన్ని ఆస్వాదించడం, ఆస్వాదింపచేయడం వారి అలవాటు. వా[...] మానస సరోవరం నుండి ఆవిర్భవించిన సంస్థలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలుగ[...] వెలుగొందడానికి తిరుమలగారి సంకల్పసి[...] చిత్తశుద్ధి తార్కాణమనడంలో అతిశయోక్తి[...]

తిరుమలగారు నన్నయ్య నడయ[...] పావన గోదావరీతీరాన రాజమండ్రిలో జన్మించారు. స్వగ్రామం పెంటపాడు నుండి[...] జంటనగరాల దాకా సాగిన జీవనప్రస్థాన[...] ఎన్నో మధురానుభూతులు... మధుర జ్ఞాపకాలెన్నెనో... కలం పట్టిన తొలిరోజుల్[...] కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి[...] దివ్యాశీస్సులు, శ్రీశ్రీ, జాషువా, కరుణశ్రీ, దివాకర్ల, సినారె, దాశరథి, శేషేంద్ర, మల్లె[...] బాపురెడ్డి, ఉండేల మొదలైన కవి దిగ్గజాల[...]

భరతమాత

"ఎవరీ దీన
ఎప్పటికీ పరాధీన
నమ్ముకున్న వాళ్ళు నట్టేట ముంచితే
కష్టాలు బాధలే
చివరకు మిగిలాయి
రాక్షసత్వం వారసత్వమైంది
తన బిడ్డలకు
ఎంత శోధించినా మానవత్వం
మచ్చుకైనా కనిపించటం లేదు
పులిబిడ్డల్ని సింహకిషోరాల్ని
కన్న పవిత్ర మాతృమూర్తికి
సర్వత్రా అసంతృప్తే
చీకట్లను తరిమిగొట్టిన
వెలుగులు చెప్పాపెట్టకుండా
ఎటోవెళ్ళిపోయాయి
కంచే చేనుమేసినట్లుగా
తన స్తన్యాన్ని కుడిచినవారే
రొమ్ము గుద్దుతుంటే
మౌనం ఆమెకు ముద్రయింది
తరళ సుందర సుకుమార గాత్రకు
అన్నీ గాయాలే
ఏ చోట తాకినా అశాంతి గేయాలే
కన్నీరు మున్నీరుగా
విలపించే సరోజ నేత్రాలతో
చిక్కి శల్యమైన
ఆ దీన ఎవరో కాదు
మన భారతమాతే!

- మంకు[...]

సరసన సమస్థాయిలో కవితా పటిమను ప్రదర్శించారు. సాహితీప్రియుల అభిమానాన్నేగాక, సాటి కవుల ప్రేమను కూడా పొందడం వారి నిర్మల మనస్సుకు అద్దం పడుతుంది. అందుకేనేమో ప్రముఖకవుల పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాలన్నీ వారికి దక్కాయి.

అరవై (పద్య, వచన, గేయ, నాటక, విమర్శ) కావ్యాలు రచించి, సత్కారాలు, బిరుదులు, పురస్కారాలు పొందారు. వారి సాహిత్యంపై ఇప్పటికే ముగ్గురు పరిశోధనలు గావించి డాక్టరేట్, ఎంఫిల్ పట్టాలు పొందడం, గురుదక్షిణగా యువకవులు తమ కావ్యాలను వీరికి అంకితమివ్వడం తిరుమలగారి నైర్మల్య సాహితీ వ్యక్తిత్వానికి మచ్చుతునకలు.

కవిత చదవాలన్నా, సమీక్ష చేయాలన్నా, అధ్యక్షునిగా సభా సారథ్యం వహించాలన్నా తిరుమలగారి శైలే వేరు. ఎందరు మహామహులు పాల్గొన్నా, తిరుమలగారి ప్రసంగానికి వుండే ప్రత్యేకత, ఆకట్టుకునే తీరు వారికే సొంతం.

ప్రపంచ కవి సమ్మేళనంలో డి.లిట్ పట్టా పొందారు తిరుమల. 1986లో ఢిల్లీలో జరిగిన జాతీయ కవిసమ్మేళనంలో 'జాతీయకవి'గా ఎంపికై ఆలపించిన "తెలుగుతేనె' కవిత ఆనాటి సభలో వారిని "మ్యాన్ ఆఫ్‌ది షో"గా అభివర్ణింపచేసింది. అందరిని అలరించింది.

"నా తెలుగునాది- ఇది మానవత్వానికి పునాది"
"ఆత్మశక్తి నా తెలుగు-అమృతకీర్తి నా తెలుగు"
"ఈ దీప్తిని నిలుపుకో-ఈ కీర్తిని పులుముకో"

అన్న పంక్తులు ప్రతి తెలుగువాడిని అలతించి, కర్తవ్యబోధ చేస్తాయి.

కవిగా తన మాటల్లో...

"మంచి మనసు లేకుండా, మనిషి ఎలా అవుతాడు?
కన్నీళ్ల రుచి తెలియకుండా, కవి ఎలా అవుతాడు?"
(రుద్రాక్షలు)

గుండె తడిని కళ్లి, కంట తడిని తెల్పినవాడే నిజమైన కవి అంటారు.

"కవిత వెలిగిన జాతిచరితకు
చీకటుండదు తెలుసుకో" (రుద్రాక్షలు)

అంటూ అక్షరాలా సాహిత్య సౌరభాలను అందరికీ పంచాలన్న కవిచంద్రులు శ్రీతిరుమల

అటు పద్యం, ఇటు వచనం సమానస్థాయిలో నడిపించగల ధీశాలి. సంప్రదాయాన్ని, ఆధునికతను సమాన నేత్రాలతో పరికించగల సమదర్శి. ప్రతి సాహిత్య కార్యక్రమంలో చివరి దాకా ఉండటం, యువకవులను సైతం ఆదరిస్తూ సాహిత్యలోకానికి పరిచయం చేయడం, నీరక్షీర న్యాయంలా కవితలోని తప్పొప్పులను సున్నితంగా చర్చించడం తిరుమలగారికే చెల్లు. ఈ సదాచారాన్ని ప్రతి తెలుగువాడూ ఆచరించిననాడు తెలుగు వెన్నెల దేదీప్యంగా ప్రకాశిస్తుంది.

అలాంటి ప్రేమైకమూర్తి, ప్రతిభాధీమూర్తి అనతికాలంలోనే అనంతవాయువుల్లో కలసిపోవడం. తెలుగు యువలోకానికి తీరని లోటు. అలాంటి ప్రోత్సాహం, అండదండలు లభిస్తాయా.. అన్నది శేష ప్రశ్నే.

స్వాతంత్ర్య జ్యోతి

పల్లవి : ప్రజాశక్తి ప్రబల స్వతంత్రజ్యోతి!
సుఖశాంతి శుభోదయాల సుందర జ్యోతి!
అనుపల్లవి : త్రివర్ణ పతాక రుచి స్వతంత్ర జ్యోతి!
నవభారత జనజాగృతి స్వతంత్ర జ్యోతి!

॥ప్రజాశక్తి॥

చరణం :
రాజన్యుల రణరంగ రక్తజ్యోతి!
పరమదేశభక్తుల ప్రాణజ్యోతి!
ధరణిలో దయామయుల ధర్మజ్యోతి!
స్వార్థరహిత సత్యాగ్రహ సత్యజ్యోతి!

॥ప్రజాశక్తి॥

యువతరోత్తేజం ఈ స్వతంత్రజ్యోతి!
అఖండముగ వెలిగే ఆశాజ్యోతి!
జాతీయ భావాల జాజ్వల్యజ్యోతి!
జనగణమన రాగాల జైహింద్‌జ్యోతి!

॥ప్రజాశక్తి॥

- వేదవ్యాస రంగభట్టర్

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

తండ్రి ఉద్యోగమే ఇవ్వాలని లేదు

మా నాన్నగారు మా గ్రామంలో తలారిగా పనిచేస్తూ చనిపోయాడు. కంపాసినేట్ గ్రౌండ్స్ కింద నాకు తలారి ఉద్యోగం వచ్చింది. కాని నేను 10వ తరగతి పాసై వున్నాను (358 మార్కులు). తలారి ఉద్యోగానికి 5వ తరగతి చదివితే చాలు. నాకు ఒకేసారి అటెండర్ ఉద్యోగం వంటివి ఇచ్చే అవకాశం లేదా కంపాసినేట్ గ్రౌండ్స్ కింద ఇచ్చే ఉద్యోగం ఒకేసారి శాశ్వత ప్రాతిపదికన ఇస్తారా? లేదా తాత్కాలికంగా ఇస్తారా? నాకు ఇచ్చిన ఆర్డర్‌లో ప్యూర్లీ టెంపరరీ అని వుంది. రెండు సంవత్సరాల తరువాత రెగ్యులర్ చేస్తామని వుంది. మా నాన్నగారి ఉద్యోగం పర్మినెంట్‌ది. కంపాసినేట్ గ్రౌండ్స్ కింద ఇచ్చే ఉద్యోగం విద్యార్హతను బట్టి ఇస్తారా? లేక తండ్రి ఉద్యోగమే ఇస్తారా; ఈ నా సందేహాలను తీర్చగలరని కోరుకుంటున్నాను.

– పి.రామయ్య, నరసింగాపురం, చిత్తూరు జిల్లా

అటెండర్ ఉద్యోగానికి మీకు అర్హత ఉంటే కంపాసినేట్ గ్రౌండ్ కింద అటెండర్ పోస్టు ఇవ్వవచ్చు. మొదట్లో తాత్కాలికంగా అన్నా మీ ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేస్తారు. ఇది అటెండర్ ఉద్యోగానికి కూడా అన్వయిస్తుంది. కంపాసినేట్ గ్రౌండ్ కింద ఇచ్చే ఉద్యోగం విద్యార్హతను బట్టి... డిపార్టుమెంట్‌లో వున్న ఖాళీలను బట్టి సరైన ఉద్యోగం ఇవ్వవచ్చు. తండ్రి ఉద్యోగమే ఇవ్వాలని ఎక్కడా లేదు. అట్లా ఉండి ఉంటే తండ్రి మండల రెవెన్యూ ఆఫీసర్‌గా చనిపోతే వారసుడుని ఎమ్.ఆర్.ఓ. పోస్టు ఇవ్వరు కదా.. అతని అర్హతను బట్టే ఇస్తారు.

ప్రమోషన్ లేక 16 సంవత్సరాలు

నేను ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్‌లో డ్రైవర్ ఆపరేటర్‌గా చేయుచున్నాను. 19 సంవత్సరాలు పూర్తి అయినది. నాకు లాగే చాలా మంది కూడా 20, 25 సంవత్సరాలుగా చేస్తున్నవారున్నారు. 45 సంవత్సరాలు దాటి కూడా ప్రమోషన్‌లేక 16 సంవత్సరాలు పూర్తయినా ఎన్‌టిపిపి-1 గ్రేడు కింద ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ లేకుండా ఉన్నాం. ఈ 16 సంవత్సరాల ఇంక్రిమెంట్ విషయంపై నేను మా డిపార్ట్‌మెంట్ హయ్యర్ అధారిటీస్‌కి రిప్రజెంటేషన్ చేసి లెటర్స్, జివోస్ పంపినవి తమకు పంపుచున్నాము. తమరు దయ ఉంచి ఈ యొక్క జివోస్ అవి పరిశీలించి మాకు తగు న్యాయ సలహా ఇవ్వవలసిందిగా కోరుతున్నాము. ఒకవేళ మేము కోర్టుకి వెళ్ళవలసి వస్తే తొందరగా తేలుతుందా? మేము విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో 45 మంది డ్రైవర్స్ ఉన్నాము. ఒక్క విశాఖపట్నంలోని 10 మంది వరకు 45 సంవత్సరాలు దాటినవారు వున్నారు. మేము కోర్టుకు వెళ్ళవలసివచ్చినట్లు అయితే ఎంతఖర్చు అవుతుంది. దయచేసి తెలియపరచి మాకు సరైన న్యాయం చేయగలరని ఆశిస్తున్నాము.

– కె.రామప్రసాద్ రావు, విశాఖపట్నం.

జి.ఓ.ఎమ్.ఎస్.150, తేది 1-9-99 ప్రకారం ప్రస్తుతం వున్న ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ గ్రాండ్స్ 8/16/24 సంవత్సరాలకు ఇంక్రిమెంట్స్ / ప్రమోషన్స్ ఆ ఆర్డర్ ప్రకారం ఏ ఏ సిస్టమ్‌లో అందరు ప్రభుత్వ ఉద్యోగులకు అన్వయిస్తుంది. దీనికి పే ఇన్ గ్రేడ్స్ 1 నుండి 21 వరకు అన్వయింప చేశారు. కాబట్టి మీరు ఈపాటికే డిపార్టుమెంటు వారికి రిప్రజంటేషన్‌లు పంపించారు కావున మీరు ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్‌లో పిటిషన్ వేసుకోవాల్సి వుంటుంది. మీకు తీర్పు రావడానికి ఎంతకాలం పడుతుంది అని నిర్ణీత కాలం చెప్పలేం. కాని కనీసం ఒక సంవత్సరం జరగవచ్చు. ఖర్చుల విషయం అంటే మీరు విడివిడిగా వేస్తే ఎక్కువ అవుతుంది. కాని అందరూ కలిసి ఒకేసారి వేస్తే ఖర్చులు తగ్గుతాయి. విడివిడి వేస్తే మాత్రం రు.4,000 నుండి రు.5,000 వరకు ఖర్చు కాగలదు.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్,
హైదరాబాద్ - 20

రుచి

రాగిపిండి లడ్డు

కావలసిన వస్తువులు:

రాగిపిండి: ఒక కప్పు

వేరుశనగ పప్పు పొడి: ఒక కప్పు

పుట్నాల పొడి: ఒక కప్పు

పంచదార పొడి: ఒక కప్పు

నెయ్యి లేక డాల్డా: 50 గ్రాములు

తయారుచేసే విధానం:

రాగులు, వేరుశనగ పప్పు (పల్లీలు), పుట్నాలు విడివిడిగా దోరగా వేయించుకోవాలి. వీటిని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. నెయ్యి వేడిచేసి అందులో అన్ని పొడులు, పంచదార పొడి వేసి బాగా కలిపి చిన్నచిన్న లడ్లుగా చేయాలి. ఈ లడ్లు చాలా రుచిగా ఉంటాయి. బలం కూడా.

సేమ్యా పకోడీ

కావలసిన వస్తువులు:

సేమ్యా: ఒక కప్పు

శనగపిండి: ఒక కప్పు

బియ్యం పిండి: అర కప్పు

కారం: ఒకటిన్నర స్పూను

ఉప్పు: తగినంత

ఉల్లిపాయ ముక్కలు: అర కప్పు

కొత్తిమీర: ఒక కట్ట

నూనె: వేయించడానికి

తయారుచేసే విధానం:

ఒక కప్పు సేమ్యా తీసుకొని మూడు కప్పుల నీళ్ళలో వేసి ఐదు నిముషాలు ఉడికించి జల్లెడలో వేసి చల్లని నీళ్ళను పోస్తే సేమ్యా పొడిపొడిగా ఉంటుంది. ఒక గిన్నెలో శనగపిండి, ఉప్పు, కారం, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర ముక్కలు అన్నీ వేసి బాగా కలపాలి. తరువాత సేమ్యా వేసి కలపాలి. ఈ పిండిని మరీ గట్టిగా కాకుండా పకోడీ పిండి మాదిరిగా కలపాలి. నూనె కాగిన తరువాత ఈ పిండిని పకోడీలు వేసుకోవాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించ

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు

అర్థసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుం